

అభివృద్ధి అంటే .. చంద్రబాబు

అభివృద్ధి చేయడం అంటే చంద్రబాబును చూసి నేర్చుకోవాలని ప్రధాని మోదీ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు అప్పట్లోనే టెక్నాలజీని అభివృద్ధి చేశారన్నారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన టెక్నాలజీని పరిశీలించేందుకు అధికారుల బృందాన్ని సైబరాబాద్ పంపానన్నారు. .

భానుడు భగభగమంటున్నా.. అమరావతి పండుగకు తరలివచ్చిన వారిని చూస్తే కలల రాజధానిపై ప్రజల్లో మమకారం ఏమాత్రం తగ్గలేదని అర్థమవుతోంది. వినాశనం నుంచి వికాసం దిశగా పయనిస్తోన్న అమరావతి అభివృద్ధికి జనం జయజయధ్వానాలు .. నేతల చప్పట్ల మధ్య ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అమరావతి అత్యద్భుత అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని నేతలు ప్రతినపూనగా.. జై అమరావతి.. జైజై అమరావతి నినాదాలతో జనం హోరెత్తించారు. అమరావతి పునర్నిర్మాణ మహోత్సవాన్ని రాజధాని గ్రామాల వాసులు ఓ పండుగగా భావించగా.. రాష్ట్ర నలుమూలల నుంచి జనం జాతరకు తరలివచ్చినట్లుగా వచ్చారు. దీంతో శుక్రవారం రాజధాని గ్రామాలతో పాటు వెలగపూడి జనసంద్రంగా మారింది. నేతల నుంచి సామాన్య ప్రజల వరకు ఎవరూ ఎటువంటి ఇబ్బంది పడకుండా అధికారులు ఏర్పాట్లు చేయడంతో కార్యక్రమం విజయవంతంగా సాగింది. అమరావతి ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో కాదని ఈ సభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మూడేళ్లలో అమరావతి నిర్మాణం జరుగుతుందని.. రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని ప్రధాని మోదీ తన ప్రసంగంలో చెప్పడంతో అటు నేతలు.. ఇటు ప్రజల్లో సంతోషం వెల్లివిరిసింది.

- నినదించిన జనం.. నేతలు
- హోరెత్తిన రాజధాని గ్రామాలు
- జన జాతరను తలపించిన వెలగపూడి
- పునఃనిర్మాణానికి భారీగా తరలివచ్చిన ప్రజలు
- మేళతాళాలతో రాజధాని రైతులు, మహిళల ఆహ్వానం
- మంగళగిరి నుంచి వెలగపూడి వరకూ ట్రాఫిక్ దిగ్బంధనం



..జై అమరావతి

మురిసిన రాజధాని రైతులు

నవ్యాంధ్ర రాజధాని అమరావతి కోసం భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులు మురిసిపోయారు. గత ఐదేళ్లు అష్ట కష్టాలు పడ్డామని.. ఈ పరిస్థితుల్లో తిరిగి అమరావతికి ప్రాణం పోస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లు పడిన కష్టాలను మరిచిపోయేలా అమరావతి భవిష్యత్తు కనిపిస్తోందంటూ పలువురు రైతులు, మహిళలు, కూలీలు ఆనందం వ్యక్తం చేశారు. ఇక ప్రభుత్వం కూడా సభలో అమరావతి రైతులకు పెద్దపీట వేసింది. వారికి ఏ ప్లస్ పాసులు ఇచ్చి ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేసింది. వీఐపీల మాదిరిగా వారికి ప్రత్యేక ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేసింది.

అమరావతి.. ఆకాంక్ష

వెలగపూడి సభ సాక్షిగా కలల రాజధాని అమరావతిపై అన్నివర్గాల్లోనూ అభిమానం ద్విగిణీకృతమైంది. అమరావతిని చూడాలన్న ఆకాంక్షతో రాష్ట్రం నలుమూలల నుంచి అన్ని వయస్సుల ప్రజలు తరలివచ్చారు. దీంతో ఉదయం 10 గంటలకే రాజధానికి దారితీసే మార్గాల్లో జన సందోహం కనిపించింది. ట్రాఫిక్‌లో చిక్కుకు పోయిన వివిధ ప్రాంతాల ప్రజలు సాయంత్రం 6 గంటలకు సభ ముగిసిన సమయంలో కూడా ప్రాంగణానికి చేరుకుంటూనే ఉన్నారు. మహిళలు ఎండ తీవ్రతను ఏమాత్రం లెక్క చేయకుండా అమరావతికి తరలిరావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.



వెల్లివిరిసిన.. జాతీయత

రాజకీయ పార్టీల జెండాలకు.. వాటి ఆనవాళ్లకు ఆస్కారం లేకుండా అమరావతి పునర్నిర్మాణ పండుగ జరిగింది. ప్రజలు కూడా మూడు రంగుల జెండాలను ప్రదర్శిస్తూ జాతీయతను చాటారు. ఇక సభ వెలుపల, సభా ప్రాంగణంలో ఎక్కడా ఏ పార్టీ జెండాల ప్రదర్శన లేకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణంలోకి కేవలం మువ్వన్నెల జాతీయ జెండాలను మాత్రమే అనుమతించారు. ప్రధాని నరేంద్ర మోదీ సభావేదిక మీదకు రాగానే ప్రజలు వందేమాతరం అంటూ జెండాలు ఊపుతూ హర్షధ్వానాలు చేస్తూ స్వాగతం పలికారు. అమరావతి రైతులు జయహో... అమరావతి అంటూ పచ్చ కండువాలు గాలిలో ఊపారు. అలానే ప్రధాని హెలిప్యాడ్ మొదలు సుమారు 1.3 కిలోమీటర్ల దూరం పొడవునా సభా ప్రాంగణం వరకు జాతీయ జెండాలతో అలంకరించారు.



తుళ్లూరు(వెలగపూడి), గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ సభతో అమరావతి జనసంద్రంగా మారింది. ప్రధాని నరేంద్ర మోదీ రూ.58వేల కోట్ల పనుల ప్రారంభోత్సవం చేశారు. ఈ సభ సందర్భంగా రాజధాని గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది. ఆంధ్రుల ఏకైక రాజధాని అమరావతేనంటూ జనాలు నినదించారు. స్థానిక రాజధాని గ్రామాల ప్రజలే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా అమరావతికి మద్దతుగా నినాదాలు చేశారు. సభ జరిగే వెలగపూడితో పాటు రాజధాని పరిధిలోని అన్ని గ్రామాల్లోనే అదే వాతావరణం కనిపించింది. రాజధాని మండల కేంద్రమైన తుళ్లూరుతో పాటు పలు గ్రామాల్లో రైతులు, మహిళలు మేళతాళాలతో శుక్రవారం ఉదయం పాదయాత్ర చేస్తూ సభకు తరలి రావాలని ప్రజలను ఆహ్వానించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని అన్ని ప్రాంతాలకు వందల సంఖ్యలో బస్సులు, కార్లు ముందురోజు సాయంత్రానికే చేరుకోగా ఆయా వాహనాల్లో జనం అమరావతికి తరలి వచ్చారు. వారికి ప్రత్యేకంగా భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. సభా ప్రాంగణానికి ఆలస్యం గా చేరుకున్న వీఐపీలకు అనుమతి లభించ లేదు. జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్‌అహ్మద్‌లకు వీఐపీ పాసులు ఉన్నా గ్యాలరీ నిండిపోయిందని పోలీ సులు అనుమతించలేదు. సభకు వెళ్లే మార్గాల న్నీ వాహనాలు, జనంతో నిండిపోయాయి. బస్సులు వెలగపూడి వైపు వెళ్లడానికి బారులు తీరడంతో మధ్యాహ్నానికి ట్రాఫిక్ దిగ్బంధనం ఏర్పడింది. సభకు చేరుకోవడానికి 8 మార్గాలను గుర్తించినా, ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి వచ్చే వాహనాలన్నీ మంగళగిరి వైపే వచ్చాయి. విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డును కాజ దగ్గర నుంచి వెలగపూడి సభ కోసం అనుమతించినా చాలామంది కృష్ణాయపాలెం రోడ్డు వైపే వచ్చారు. దీంతో తాడేపల్లి, మంగళగిరి వైపు నుంచి వచ్చే బస్సులన్నీ కృష్ణాయపాలెం జంక్షన్ వద్ద నుంచి ఆగిపోయాయి. ఆ జంక్షన్ నుంచి మందడం సరిహద్దుల్లోని వెస్ట్ బైపాస్ అండర్ పాజ్, ఈ-8 రోడ్డు జంక్షన్ వరకూ బస్సులు నిలిచిపోయాయి. సభానంతరం తిరిగి వెళ్లే సమయంలో కూడా అదే పరిస్థితి పునరావృతమయింది.

మధ్యాహ్నానికే కిటకిట

అమరావతి సభకు జనం పోటెత్తారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావడంతో సభా ప్రాంగణం మధ్యాహ్నం 12 గంటలకే నిండిపోయింది. ఎండ భగభగ మండుతున్నా జనం వాటిని లెక్క చేయకుం డా తరలివచ్చారు. రాజధాని సమీప జిల్లా లైన ఇటు గుంటూరు, పల్నాడు, అటు ఎన్టీఆర్ విజయవాడ, కృష్ణా జిల్లాల నుంచి భారీగా జనం తరలివస్తారని అంచనా వేయ గా అంతకుమించి జనం పోటెత్తారు. దీంతో వెలగపూడి గ్రామం జనసంద్రాన్ని తలపించింది. గ్యాలరీలన్నీ నిండిపోవడంతో ఆలస్యంగా సభా ప్రాంగణానికి చేరుకున్న వారు రోడ్లపైనే ఉండాల్సి వచ్చింది. పార్కింగ్ ప్రదేశాలతో పాటు ఈ -6, 7, 8 రోడ్ల వరకు, ఎన్-9 రోడ్డు, సచివాలయం చుట్టుపక్కల రోడ్లన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. సభా ప్రాంగణానికి చుట్టుపక్కల కిలోమీటరు మేర ఎటు చూసినా జనమే కనిపించారు.



అన్నిమార్గాలూ.. అమరావతి వైపే

అమరావతి పునర్నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఓ పండుగలా నిర్వహించగా.. రాజధాని సమీప జిల్లావాసులే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి జనం పోటెత్తారు. కలల రాజధాని.. మన అమరావతి.. ఛలో అమరావతి.. జనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాజధానికి దారితీసే మార్గాలన్నీ ఉదయం నుంచే వాహనాలు, జనంతో సందడిగా మారాయి. ఇటు తాడికొండ.. అటు మంగళగిరి, తాడేపల్లి రోడ్లపై వాహనాలు బారులు తీరాయి. అమరావతి సభకు వచ్చే వారి కోసం ఎక్కడికక్కడ ప్రత్యేకంగా భోజన, తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాల్లో పలువురు సేద తీరారు.







హెలీప్యాడ్ వద్ద మోదీ స్వాగతం..



సభకు తరలివస్తున్న విద్యార్థినులు, మహిళలు



గ్యాలరీల బయట మహిళల సందోహం



జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

వెలగపూడిలో పార్కింగ్ స్థలంలో బస్సులు





మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు స్ఫూర్తిదాయకం

● రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని



వీల్ చైర్లు అందజేస్తున్న నన్నపనేని రాజకుమారి

గుంటూరు(తూర్పు), మే 2(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా నిలబడుతున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి పేర్కొన్నారు. పారిశ్రామికవేత్త ఘంటా పున్నారావు సౌజన్యంతో స్థానిక స్తంభాలగరువు మహాప్రస్థానంకు వీల్‌చైర్లు సమకూర్చారు. శుక్రవారం స్థానిక బృందావన్ గార్డెన్స్, సీనియర్ సిటిజన్స్ సర్వీస్ అసోసియేషన్ కార్యాలయంలో సేవా సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నన్నపనేని పాల్గొన్నారు. వీల్‌చైర్లను నిర్వాహకులకు అందజేశారు. సంస్థ స్ఫూర్తితో జీజీహెచ్‌కు మూడు వీల్ చైర్లు అందజేస్తామని ఆమె తెలిపారు. సీనియర్ సిటిజన్స్ సర్వీస్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుపతయ్య, మహాప్రస్థానం ఉపాధ్యక్షుడు సుందర రామయ్య, కార్యదర్శి తాండవ కృష్ణ, మానవతా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పదవికే వన్నెతెచ్చిన మహనీయుడు డాక్టర్ కోడెల

● రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ● ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ స్పీకర్ విగ్రహావిష్కరణ



డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, ఎంపీ లావు తదితరులు

నరసరావుపేట టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఏ పదవి నిర్వహించిన దానికి వన్నె తెచ్చిన మహనీయుడు డాక్టర్ కోడెల శివప్రసాదరావు అని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మాజీ స్పీకర్, దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ హోం మినిస్టర్ అంటే పలాన శివప్రసాదరావు అని ఈరోజు కూడా గుర్తు చేసుకునే విధంగా పనిచేశారని కొనియాడారు. స్పీకర్‌గా పనిచేసి ఆ కుర్చీకే గౌరవం తీసుకొచ్చిన మహావ్యక్తి అని ప్రశంసించారు. అసెంబ్లీలో నాడు తాను ప్రతిపక్షంలో ఉండి ఏప్పుడు మైకు అడిగినా ఇవ్వని రోజు లేదని గుర్తుచేసుకున్నారు. నేడు డాక్టర్ కోడెల శివప్రసాదరావు మన మధ్య లేకపోవడం బాధాకరం మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి కుట్రలో భాగంగా కోడెలపై చిన్న చిన్న నిందలు వేసి ఆయనను మన మధ్యలేకుండా చేశారన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మంత్రి గొట్టిపాటి, నసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విగ్రహావిష్కరణ పూర్తి చేయాలనే నిర్ణయించుకొని కార్యక్రమం ఘనంగా నిర్వహించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంతంలో మొదటిసారిగా తెలుగుదేశం పార్టీ జెండాను ఐదుసార్లు అప్రతిహతంగా ఎగరవేయగలిగారని కొనియాడారు. ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కోడెల శివప్రసాదరావు వర్ధంతి సెప్టెంబరు 16న వినుకొండలో ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ మాట్లాడుతూ అమరావతి పునఃనిర్మాణం జరిగే రోజున ఆయన నిర్మించిన ఆసుపత్రి ఆవరణలో 77వ జయంతి సందర్భంగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహం ఆవిష్కరణ, టీడీపీ కుంటుంబ సభ్యులందరూ ఇక్కడ కలుసు కోవడం సంతోషంగా ఉందన్నారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పల్నాడు ప్రాంతానికి ఒక గౌరవాన్ని తెచ్చిన మహానాయకుడు డాక్టర్ కోడెల శివప్రసాదరావు అన్నారు. టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, లలిత్‌సాగర్, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఆసుపత్రి కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటిటి శ్రీధర్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, కుమ్మెత కోటిరెడ్డి, గంగుల పెద్దిరెడ్డి, మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి, కొండ్రుగుంట లక్ష్మి, డాక్టర్ పూరేటి భారతి తదితరులు పాల్గొన్నారు.

రేపు నీట్‌కు ఏర్పాట్లు పూర్తి

● ఉమ్మడి జిల్లాలో 16 కేంద్రాలు, 4,250 మంది విద్యార్థులు

గుంటూరు (విద్య) మే 2 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల్లో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో ఎన్‌టీఏ నిర్వహించే (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్)నీట్ ఆదివారం జరగనుంది. పరీక్ష కోసం ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎన్‌టీఏ మొత్తం 16 కేంద్రాలు ఏర్పాటు చేసింది. 4,250 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షకు విస్తృత భద్రత ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు డ్రెస్ కోడ్ పాటించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే నిబంధనలతో కూడిన సమాచారాన్ని పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు తెలియజేశారు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా ఉదయం 11 గంటలకే కేంద్రాలకు చేరు కోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 514.10 అడుగులు ఉంది. ఇది 138.73 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో 1,350 క్యూసెక్కుల దిగువకు విడుదల చేస్తున్నారు.

ఎడ్ల పందేలు సంస్కృతిలో భాగం: మంత్రి సత్యకుమార్ యాదవ్




విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, మే, 2 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల పందేలు నిర్వహించడం సంస్కృతి సాంప్రదాయాల్లో భాగంగా వస్తుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ధూళిపాళ్ల వీరయ్యచౌదరి మెమోరియల్ జాతీయస్థాయి ఒంగోలు జాతి వృషభ రాజాల బలప్రదర్శన పోటీలకు శుక్రవారం రెండవ రోజు మంత్రి సత్యకుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలిరోజు టచ్‌పళ్ల విభాగంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎడ్ల పందేలను ప్రారంభించి, జతల యజమానులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ మన జీవన విధానంలో పశువులను కుటుంబ సభ్యులుగా చూస్తామని పేర్కొన్నారు. నేటి యాంత్రిక జీవితంలో ఆటవిడుపుగా ఇలాంటి పోటీలకు వచ్చి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పండుగ వాతావరణంలో 8రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలను తాను ఊహించలేదన్నారు. రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చిన తాను తన జీవితంలో ఇంత పెద్దస్థాయి పందేలను మొదటిసారిగా చూస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదర్శ ప్రజానాయకుడు అని కొనియాడారు. ఆరు సార్లు గెలుపొందడమంటే ఎలా విజయం సాధించవచ్చో నరేంద్రకుమార్‌ను చేసి నేర్చుకుంటున్నామన్నారు. రెండు పళ్ల విభాగంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన 24 జతల ఎడ్లు 800కిలోల బండను లాగి పోటీల్లో హోరాహోరీగా తలపడ్డాయి.

మూడేళ్లలో పూర్తిగా..

మారనున్న అమరావతి రూపురేఖలు: ప్రత్తిపాటి



ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మే2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃనిర్మాణం నవ్యాంధ్ర ప్రగతికి దోహదపడే సరికొత్త ప్రయాణం అని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. ఆంధ్రమాత గర్వించేలా, భరతమాత మురిసేలా జోరుగా ప్రజా రాజధాని నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రానికే తలమానికమైన రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభ ఘట్టం ప్రధాని మోదీ చేతుల మీదుగా జరగడం తెలుగు ప్రజలకు కనివినీ ఎరుగని గొప్ప సంబరంగా నిలిచిందన్నారు. ఇక అమరావతిలో పనుల జోరు పెరిగీ, రాష్ట్రానికి మరిన్ని కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గత పాలకుల దుష్ట, స్వార్థ రాజకీయాలకు బలైన అమరావతి కూటమి ప్రభుత్వ రాకతో, ప్రధాని మోదీ అండతో బతికి బంగారు బాటపట్టిందని వివరించారు. వచ్చే మూడేళ్లలో అమరావతి రూపురేఖలు పూర్తిగా మారిపోయి ఆంధ్ర ప్రజల రాజధాని కలలు సాకారమవుతాయని ఆకాంక్షించారు. అమరావతి శ్మశానమని, ఎడారని, కేవలం ఒక వర్గానికే పరిమితమని వైసీపీ ప్రభుత్వం చిమ్మిన విద్వేషం, నిర్మాణ పనుల్లో చేసిన విధ్వంసం అంతా ఇంతాకాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ దొంగలు చివరకు నిర్మాణ సామగ్రిని, రోడ్లను కూడా తవ్వేసి అమ్ముకునేంతలా దిగజారారని విమర్శించారు. చంద్రబాబు ప్రారంభించిన అమరావతి పనులు కొనసాగిస్తే, తనకు ఒరిగేదేమీ ఉండదనే సంకుచిత బుద్ధితో జగన్మోహన్ రెడ్డి మూడుముక్కలాట ఆడి, ప్రజల మధ్య ప్రాంతీయ విద్వేషాలు రేపి, పబ్బం గడుపుకునే ప్రయత్నం చేశాడని పేర్కొన్నారు. చంద్రబాబు పిలుపుతో రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతుల్ని నిర్దాక్షిణ్యంగా హింసించాడని అన్నారు. జగన్ దౌర్జన్యాలు, దాష్టీకాలు, దమనకాండను తట్టుకొని మొక్కవోని దీక్షతో 1,631రోజుల పాటు రైతులు, మహిళలు చేసిన పోరాటం దేశానికే స్ఫూర్తిదాయకంగా నిలిచిందని అన్నారు. ప్రధాని మోదీ సాక్షిగా జరిగిన రాజధాని బహిరంగసభ అమరావతి రైతుల ఆనందబాష్పాలు, భావోద్వేగాలతో పులకించిందని అన్నారు.

రైల్వే పనుల్లో నాణ్యత పాటించాలి

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



డీఆర్‌ఎం సుధేష్ణ సేన్‌తో మాట్లాడుతున్న మంత్రి పెమ్మసాని

గుంటూరు (తూర్పు), మే 2(ఆంధ్రజ్యోతి): గతి శక్తి పథకం కింద జరుగుతున్న ఆర్‌వోబీ, అమృత్ భారత్ కింద జరుగుతున్న రైల్వే స్టేషన్ పనులు పూర్తిస్థాయి నాణ్యతతో ప్రజలకు అందించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు రీజినల్ డీఆర్‌ఎం సుధేష్ణ సేన్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. పెమ్మసాని మాట్లాడుతూ గతి శక్తి పథకం కింద జరుగుతున్న ఇన్నర్ రింగ్ రోడ్, పెదపలకలూరు, అలాగే అసంపూర్తిగా ఆగిన నందివెలుగు ఆర్‌వోబీ తదితర వంతెనల పనులను త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని అన్నారు. అమృత్ భారత్ కింద గుంటూరులో జరిగే రైల్వే స్టేషన్ పనులను గతంలో తాను పరిశీలించానని, అవి నాసిరకంగా కనిపించాయని చెప్పారు. సుధేష్ణ సేన్ మాట్లాడుతూ ఉత్తర భారత దేశం మాదిరిగా ఆర్‌వోబీలపై షెడ్లు (రూఫ్ టాప్) ఏర్పాటు చేయాలని, దీంతో వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. రైల్వే క్రాసింగ్ వద్ద వాహనాల ప్రమాదాలను, పశువుల రాకపోకలు నివారించి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని కోరారు.

సిబ్బంది కొరతతో 8 రైళ్ల రద్దు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రైల్వే సిబ్బంది గ్రూపు-బీ పరీక్షకు హాజరు కానుండడంతో ఎనిమిది రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. ఈ నెల 3, 4, 5 తేదీల్లో (57201) విజయవాడ- గుంటూరు, (57203) గుంటూరు- మాచర్ల, (57206) మాచర్ల- నడి కుడి, (57205) నడికుడి -మాచర్ల, (57204) మాచర్ల - గుంటూరు, (57202) గుంటూరు- విజయవాడ రైళ్లను, 4, 5 తేదీల్లో (67779) కాచీగూడ- నడికుడి, (67780) నడికుడి - కాచీగూడ రైళ్లను రద్దు చేసినట్లు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ శుక్రవారం తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 145, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

అమరావతి సభకు చేరకుండానే..

ఎన్‌హెచ్-16 టోల్ ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ జామ్



కాజ టోల్ ప్లాజా వద్ద ఆగిన బస్సులు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునఃప్రారంభ బహిరంగ సభకు.. ఎన్నో ప్రయాసలకోర్చి వచ్చిన వేలాది మంది ప్రజలు చేరుకోలేకపోయారు. ముఖ్యంగా ఎన్‌హెచ్-16 చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారి మీదగా వచ్చిన వాహనాలు కాజా టోల్ ప్లాజా వద్ద వేలాది సంఖ్యలో నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాలు దాదాపుగా ఐదు కిలోమీటర్ల పొడవునా బారులుదీరాయి. అలానే మంగళగిరి నియోజకవర్గంలో డాన్ బాస్కో స్కూలు నుంచి యర్రబాలెం, కృష్ణాయపాలెం వరకు ట్రాఫిక్ భారీగా జామ్ అయింది. హైవే మీద వాహనాలు సులభతరంగా సభా స్థలికి చేరుకొం టాయని అంతా భావించారు. అయితే అందుకు విరుద్ధంగా చిన్న రోడ్లలో వచ్చిన వాహనాలు ప్రాంగణం వద్దకు సులభ తరంగా చేరుకొన్నాయి. ఇక్కడ పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. రాయ లసీమ, పల్నాడు వైపు నుంచి వచ్చిన వాహనాలకు అమరావతి మీదగా రూట్ ఇచ్చారు. ఈ మార్గంలోనూ ట్రాఫిక్ స్తంభిం చిపోవడంతో చాలామంది మహిళలు బస్సుల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. వాళ్లలో చాలామంది సభ వద్దకు రాకుండానే వెనుదిరిగారు. దాంతో మహిళలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు.

తెరుచుకున్న విజయవాడ వెస్టు బైపాసు

ప్రధాని సభ దృష్ట్యా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకూడదని విజయవాడ వెస్టు బైపాసు రోడ్డుని తాత్కాలికంగా తెరిచారు. దీంతో ఎన్‌హెచ్-16లో చినకాకాని వెంకటపాలెం వద్ద సర్వీసు రోడ్డు నుంచి సీడ్‌యాక్సిస్ రోడ్డుకు వాహనాలను మళ్లించారు. అలానే విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలను సూరాయపాలెం నుంచి కృష్ణానది వంతెన మీదగా సీడ్ యాక్సెస్ రోడ్డులోకి అనుమతించారు. దీంతో ఎక్కువ సంఖ్యలో వాహనాలు ప్రధాని రాక ముందే సభాస్థలి వద్దకు చేరుకొన్నాయి.

పోలీసుల ఓవరాక్షన్

ప్రధాని సభ సందర్భంగా పోలీసులు చాలా చోట్ల అతిగా ప్రవర్తించారు. కొంతమంది వీవీఐపీలు, వీఐపీలను కూడా వారికి కేటాయించిన గ్యాలరీల్లోకి అనుమతించలేదు. దీంతో వారంతా అసంతృప్తి వ్యక్తం చేశారు. తగిన పాస్‌లతో వచ్చినా వాహనాలను.. వారికి కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోకి అనుమతించకుండా బస్సులు పార్కింగ్ చేసిన ప్రాంతానికి మళ్లించారు. దీనిపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలానే బహిరంగ సభ జరిగిన ప్రదేశంలో దాదాపుగా లక్ష కుర్చీల వరకు వేశారు. తొలుత ఆ గ్యాలరీల్లోకి అనుమతించకుండా స్టాండ్‌బై వేదికకు ఎదురుగా సిద్ధం చేసిన ప్రాంగణంలోకి ప్రజలను తరలించి, కింద కూర్చోబెట్టారు. అక్కడ ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి వాటిల్లోనే సభ చూడాలన్నారు. తాము ఇంత ప్రయాస పడి వచ్చింది సభని ఎల్‌ఈడీ తెరల్లో చూడటానికా అని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్యాలరీల్లోకి అనుమతించకుండా అడ్డుకోవడం పైనా పోలీసుల తీరును తప్పుబట్టారు.

67,379 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 65,069 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 67,379 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 40,246 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13200
నంబరు.5	10000	12500
273	----	-----
341	10000	13300
4884	10000	11200
సూపర్10	10000	12300
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
తేజ	10000	13700
షార్క్-1	----	----
బ్యాడిగి 355	10000	13000
సింజెంటా బ్యాడిగి 5531	---	---
దేవనూరుడీలక్స్	10000	12600
ఆర్మూరు	9800	11200
తాలుకాయలు	4500	6500

సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన అగ్నిప్రమాదం



కమ్ముకున్న నల్లటి దట్టమైన పొగ

తుళ్లూరు (మందడం) మే2(ఆంధ్రజ్యోతి): మందడం దగ్గరిలో సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. రాజధాని నిర్మాణ పనుల నిమిత్తం ఓ ఏజన్సీ కంపెనీ గతంలో నిల్వ చేసి ఉంచిన ప్లాస్టిక్ పైపుల గుట్టకు నిప్పు అంటుకుంది. మంటలు ఎగసి పడటం, నల్లటి దట్టమైన పొగ కమ్ముకోవడంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. ప్రధాని సభ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో అప్రమత్తమయ్యారు. దాదాపు గంటన్నర పాటు మంటలు చెలరేగుతూ నల్లటి పొగ కమ్మేసింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా ఇలా చేశారు.. లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాని సభ జరిగే ప్రదేశానికి ఈ ప్రాంతం ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఏపీ ఫార్మా సేల్స్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

గుంటూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫార్మా సేల్స్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ (ఏపీపీఎస్ఈఏ) నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అసోసియేషన్ గుంటూరు బ్రాంచ్ 16వ వార్షిక సర్వ సభ్య సమావేశం పట్టాభిపురంలోని నార్త్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికలో అసోసియేషన్ గుంటూరు శాఖ అధ్యక్షుడిగా ఎ.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పీఎల్ వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా వి.శివరామకృష్ణ, ఉప కార్యదర్శిగా ఎం.బషీర్‌బేగ్, కోశాధికారిగా ఎం.సాంబశివరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఫార్మా రంగంలో వస్తోన్న పెనుమార్పులపై చర్చించారు. అంతేగాక అత్యధిక మందుల ధరలు, ఫార్మా మేనేజర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ప్రస్తావించారు. సమావేశంలో పలువురు అసోసియేషన్ నాయకులు, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు హాజరయ్యారు.


ఏపీ ఫార్మా సేల్స్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ నాయకులు

ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌పై జేకేసీలో అవగాహన సదస్సు

గుంటూరు (విద్య), మే 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జేకేసీ కళాశాలలో శుక్రవారం ప్రాంప్ట్ ఇంజనీరింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో సంచాలకులు, కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి ఆచార్య యలవర్తి సురేష్ బాబు మాట్లాడుతూ విభిన్న పాఠ్య ప్రణాళికలతో కూడిన విద్యా బోధనకు, నేటి వర్తమాన పరిశోధనాత్మక పరిస్థితులకు మధ్య గల వ్యత్యాసాన్ని భర్తీ చేసేందుకు ఏర్పాటు చేశామన్నారు. ఈ సదస్సులో కళాశాల సహాయ ప్రిన్సిపల్ కే.సాంబశివరావు, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పరుచూరి గోపీచంద్, శిక్షకులు వికాస్, డిగ్రీ కంప్యూటర్ సైన్స్ కోర్సు విభాగాధిపతి వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శిక్షకులు వికాస్

బీపీ, షుగర్‌పై రేపు ఆరోగ్య సభ

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : అన్ని వ్యాధులకు మూల కారణాలైన బీపీ, షుగర్‌లపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ఈనెల 4వ తేదీన అరండల్‌పేట 15/1వ లైనులోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఉదయం ఆరోగ్యసభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వీవీ రామ్‌కుమార్ ప్రధాన వక్తగా హాజరవుతారన్నారు. బీపీ, షుగర్‌లపై అవగాహన కల్పించి, జాగ్రత్త చర్యలను వెల్లడిస్తారన్నారు. ప్రజల జీవనశైలి, ఆహార వ్యవహారాలలో మార్పులు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు(తూర్పు), మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని మండల కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు రూరల్ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఇంటూరి పద్మావతి అధ్యక్షతన జరిగే సమావేశంలో ప్రజా ప్రతినిధులు, మండల సిబ్బంది పాల్గొనాలని కోరారు.

శంకరాచార్య, రామానుజాచార్యుల జయంత్యోత్సవాలు

గుంటూరు(తూర్పు), మే 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం శంకరాచార్యులు, రామానుజాచార్యుల జయంత్యోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులచే దేవాలయ పాలకమండలి వారు నిర్వహించారు. అన్నమయ్య కళావేదికపై సత్సంగ సభ్యులచే అష్టోత్తర శతనామావళి పారాయణం చేశారు. అనంతరం తోట నరసింహరావు సౌజన్యంతో జొన్నా శివనాగేశ్వరరావుచే సుందరకాండ పారాయణం నిర్వహించారు. వీరికి తబలపై ఎస్.వెంకట్, కీబోర్డుపై డి.రామకృష్ణ వాయిద్య సహకారం అందించారు.


సుందరకాండ పారాయణ చేస్తున్న జొన్నా శివనాగేశ్వరరావు

కొలకలూరులో ఆహ్వాన నాటికల పోటీలు ప్రారంభం

తెనాలి అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని కొలకలూరులో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉభయ రాష్ట్ర స్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కొలంకపూరి నాటక కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు స్వామి, ఉపాధ్యక్షుడు సుద్దపల్లి మురళీధర్ జ్యోతి వెలిగించి నాటకాలు ప్రారంభించారు. పొన్నూరు కళా పరిషత్ అధ్యక్షుడు ఆకుల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో వరగాని పరిషత్ అధ్యక్షుడు టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రతిఏటా కొలకలూరులో నాటిక పోటీలు నిర్వహించి కళలను, కళాకారులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. సమాజాన్ని చైతన్యపరిచే కళలను ఆదరించి భావి తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షుడు పాండురంగారావు, కొండవీటి పరిషత్ అధ్యక్షుడు శ్రీహరి, రామాంజనేయులు, కళాంజలి కార్యదర్శి సాంబశివరావు ప్రసంగించారు. అనంతరం కాట్రపాడు ఉషోదయ కళానికేతన్ కళాకారులు కిడ్నాప్ నాటికను ప్రదర్శించారు. వీరన్నపాలెం కళానికేతన్ కళాకారులు రుతువులేని కాలం, విజయవాడ గురజాడ కళామందిర్ కళాకారులు మహా ప్రస్థానం నాటికలు ప్రదర్శించారు. మరో నాటిక రుతువు లేని కాలం సమాజంలో సంప్రదాయాలకు, కుటుంబ బంధాలకు విలువ లేకుండా పోతుందని, కోడలు వైనాన్ని గ్రహించిన అత్తగారు ఆమెను మార్చి కుటుంబ బంధం తెలియజేయడమే ఇతివృత్తంగా కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. రంగస్థల నటుడు గంగోత్రి సాయికి కరణం సురేష్ జ్ఞాపకార్థం సవ్యసాచి అవార్డు ప్రదానం చేశారు. సంగీత దర్శకుడు పి.లీలామోహనరావుకు టి.సాంబశివరావు స్మారక పురస్కారం అందజేశారు.


కిడ్నాప్ నాటికలోని సన్నివేశం


మూడొంతెనల రైల్వే బ్రిడ్జి వద్ద కూలిపోయిన పరదా, దాని పైనే పడేసిన దాగు మామిడి కాయలు


మస్తాన్‌దర్గా వెనక వీధిలో పరదా కట్టడం వలన రోడ్డు మీద పడేసిన వ్యర్థాలు

పరదా కట్టారు.. చెత్త వేయకుండా ఎవరు ఆగుతారు?

- నగరపాలకసంస్థకు వృథా ప్రయాస... ఖర్చు
- లోపాలు సవరించుకోకుండా ఎన్ని చేసినా నిరుపయోగమే

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): 'బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడేయడం సామాజిక నేరం... ఎవరైనా వేస్తే రూ.500 నుంచి రూ. 5000 వరకు జరిమాన విధించబడును' అంటూ హెచ్చరిక పోస్టర్లు ఏర్పాటు చేసి నగర పాలక సంస్థ గుంటూరు నగరంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన ఆకుపచ్చ పరదాలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పారిశుధ్య కార్మికులను ఇంటింటికి పంపించి చెత్త సేకరించడం చేతగాని కార్పొరేషన్ ఇలా నగరంలో డంపర్‌బిన్‌లు లేకుండా చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎంత ఫైన్ వేస్తారో వేయండి అంటూ ఎక్కడైతే కార్పొరేషన్ ఈ ఆకుపచ్చ పరదాలు కట్టిందో అక్కడే దాని పక్కనో, లోపలో చెత్త పడేసి నిరసన తెలుపుతున్నారు. తక్షణమే తొలగించిన డంపర్‌బిన్‌లను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

నగరంలో నిత్యం ఇంటింటికి చెత్తని పారిశుధ్య కార్మికులు సేకరించడం లేదు. ఇందుకు కారణం ఇద్దరు కార్మికులను ఒక బృందంగా విభజించి వాళ్లకి పుష్‌కార్టు ఇచ్చి అందులో నాలుగు ప్లాస్టిక్ బిన్‌లు ఇచ్చి దాదాపుగా 350 ఇళ్ల నుంచి చెత్తని సేకరించమంటున్నారు. దీంతో పాటు రోడ్లు ఊడ్చడం, కాలువలు తీయడం, ఎవరైనా వీఐపీలు వస్తే అక్కడికి పంపించడం వంటివి చేస్తున్నారు. ఈ కారణంగా ఇంటింటి నుంచి చెత్త సేకరణకు విఘాతం కలుగుతున్నది. పైగా మూడు డస్టుబిన్‌ల్లో వ్యర్థాలు వేరు చేసి ఇవ్వమంటున్నారు. ఒక దాంట్లో తడి, మరో బిన్‌లో పొడి, ఎర్ర రంగు బిన్‌లో ప్రమాదకరమైన వ్యర్థాలను పడేయాలంటున్నారు.

గార్బేజీ ట్రాన్సిట్ సిస్టమ్‌లోనే లోపాలు

గుంటూరులో నిత్యం 440 టన్నుల వరకు గార్బేజీ ఉత్పత్తి జరుగుతున్నది. ఇందులో 197 టన్నులు తడి, 243 టన్నుల పొడి చెత్త ఉంటున్నది. ఈ చెత్త అంతా నాయుడుపేటలోని జిందాల్ వేస్టు టూ ఎనర్జీ ప్లాంట్‌కు తరలించాలి. ఇందుకోసం నగరపాలకసంస్థ వ్యవస్థ ఏర్పాటు చేసుకొన్నది. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తని ఒక చోటికి చేర్చి అక్కడ వాహనాల్లోకి లోడింగ్ చేయాలి. ఆ తర్వాత అది జిందాల్ ప్లాంట్‌కు చేరుస్తారు. అయితే పారిశుధ్య కార్మికులు సేకరించి తీసుకొచ్చిన వ్యర్థాలను వెంటనే టిప్పర్లు/ట్రాక్టర్లలోకి లోడింగ్ చేయడం లేదు. దీంతో వాళ్ల పుష్‌కార్టులను ట్రాన్సిట్ పాయింట్ల వద్ద ఉంచుతున్నారు. ఆ సమయంలో పశువులు వచ్చి వాటిల్లోని వ్యర్థాలను చెల్లాచెదురు చేస్తున్నాయి. నగర పాలక సంస్థ సిబ్బంది నిత్యం చెత్త సేకరణకు రాకపోతుండటం వలన ప్రజలు తమ ఇళ్లల్లో ఉత్పత్తి అయిన వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన భరించలేక సమీపంలోని డంపర్‌బిన్ వద్దకు తీసుకొచ్చి పడేస్తున్నారు.

పారిశుధ్య కార్మికులపై పర్యవేక్షణ కరువు

నగరపాలకసంస్థలో పర్మినెంట్, అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులున్నారు. అలానే బదిలీ వర్కర్లు కూడా ఉన్నారు. అయితే వీళ్లలో కొందరు మచ్చరు వేసి విధులకు గైర్హాజరౌతున్నారు. ఇందుకు సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్/వార్డు సెక్రెటరీలు లోపాయికారిగా వ్యవహరిస్తుండటమే. నెలకు వారికి వచ్చే జీతంలో కొంత పర్సంటేజీని తీసుకొని కార్మికులు విధులకు హాజరుకాకపోయినా పట్టించుకోవడం లేదు. ఇది గార్బేజీ కలెక్షన్‌పై ప్రభావం చూపుతున్నది. ఈ లోపాలను నగరపాలకసంస్థ సరి చేసుకో కుండా రూ.లక్షలు ఖర్చు పెట్టి ఇలా ఆకుపచ్చ పరదాలు కట్టి చెత్త పడేస్తే జరిమాన వేస్తామని నోటీసు పెడితే ఏమి ఉపయోగం అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చాలామందికి వీటిపై అవగాహన లేకపోవడంతో పరదా లోపల చెత్త వేయాలేమోనని భావిస్తూ తీసుకొచ్చిన వ్యర్థాలను లోపల గుమ్మరిస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి హౌస్ అరెస్టు

గుంటూరు, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ మహోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సభ పురస్కరించుకొని ముందస్తు చర్యల్లో భాగంగా కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలిని ఆయన కార్యాలయంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. సభ ప్రారంభానికి ముందుగానే శుక్రవారం ఉదయం పొన్నూరు రోడ్డు బారాయిమాపంజాలోని మస్తాన్‌వలి నివాసానికి పోలీసులు చేరుకున్నారు. ఆయనను బయటకు పోనీయకుండా ప్రధాని సభ ముగిసే సాయంత్రం వరకు ఆయనను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ విపక్ష నేతలను హౌస్ అరెస్టులు చేయటం అప్రజాస్వామికమని విమర్శించారు.


మస్తాన్‌వలితో ఆయన కార్యాలయంలో మాట్లాడుతున్న పోలీసులు

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

గుంటూరు, మే 2(ఆంధ్రజ్యోతి) : మిర్చియార్డు ముఠా కార్మిక సంఘం నేత గరిగంటి వెంకయ్య 20వ వర్ధంతి పురస్కరించుకొని ఆయన తనయుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గరిగంటి వెంకటేశ్వర్లు జిన్నాటవర్ సెంటర్‌లో శుక్రవారం పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పొన్నూరు రూరల్ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన వెంకయ్య మిర్చి యార్డు ముఠా కార్మిక సంఘం నాయకుడిగా ఎంతో మంది ముఠా కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. పరోపకారమే పరమధర్మం అన్నట్లుగా వెంకయ్య జ్ఞాపకార్థం ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కంజుల వెంకటేశ్వరరెడ్డి, హైమావతి, మీరావలి తదితరులున్నారు.


ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు తదితరులు

కవి బుర్రి కుమార్ రాజుకు ప్రశంసా పత్రం

గుంటూరు జిల్లా శ్రీశ్రీ కళా వేదిక ఉపాధ్యక్షుడు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రచయితల సంఘం కార్యదర్శి కవి బుర్రి కుమార్ రాజుకు ప్రశంసా పత్రం లభించింది. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డాక్టర్ కేసీరాజు (గజల్ శ్రీనివాస్) అధ్యక్షతన పెహలగావ్ అమర జ్యోతి అంతర్జాల కవి సమ్మేళనంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహించిన అమరులకు అశ్రుతర్పణంలో పాల్గొని దేశభక్తి, దేశ సమగ్రత, ఐకమత్యం అనే అంశాలపై చక్కని కవితను వినిపించి, ప్రతిభను ప్రదర్శించినందుకు అభినందన ప్రశంస పత్రం లభించిందని ఈ సందర్భంగా కవి మిత్రులు ఎస్.ఎం. సుభాని, నానా, బొమ్ము ఉమామహేశ్వర రెడ్డి, జానీ బాషా, జమదగ్ని తదితరులు అభినందనలు తెలిపారు.


కవి బుర్రి కుమార్ రాజు

అపార్టుమెంట్ పైనుంచి దూకి వివాహిత ఆత్మహత్య

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణనగర్ జీరో లైన్ కి చెందిన వివాహిత అపార్టుమెంట్ 5వ అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శుక్రవారం వేకువజామున చోటుచేసుకుంది. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన కొత్తమాసు మణి కాంత్‌కు కృష్ణనగర్ జీరో లైన్ కి చెందిన మేఘన (24)తో 2023 ఫిబ్రవరిలో వివాహం జరిగింది. వారికి ఏడాది వయసు ఉన్న కుమార్తె ఉంది. మణికాంత్ అద్దంకిలో పప్పుల మిల్లు నిర్వహిస్తుంటాడు. ఇదిలా ఉంటే కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు వచ్చాయి. దీంతో నెలన్నర రోజులుగా మేఘన కృష్ణ నగర్‌లోని పుట్టింటిలో ఉంటోంది. పెద్ద మనుషులు గురువారం అద్దంకి వెళ్లి మణికాంత్, ఆయన కుటుంబ సభ్యులతో చర్చలు జరిపారు. అయితే మణికాంత్ వాదనలో ఏమాత్రం మార్పు కనిపించలేదు. దీంతో మనస్థాపానికి గురైన మేఘన శుక్రవారం ఉదయాన్నే తాను ఉంటున్న అపార్టుమెంట్ నాలుగవ ఫ్లోర్ నుంచి పై అంతస్తులోకి వెళ్లి అక్కడ నుంచి కిందకు దూకేసింది. దీంతో మేఘన అక్కడికక్కడే కన్నుమూసింది. ఈ మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతురాలు మేఘన

బాలుడి అదృశ్యం

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రమౌళినగర్‌కు చెం దిన షేక్ అస్రార్ అనే బాలుడు అదృశ్యమయ్యాడు. శుక్రవారం మధ్యాహ్నం చంద్రమౌళి నగర్ మూడో లైను వద్ద తప్పిపోయాడు. బాలుడికి ఆటిజం లక్షణాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాలుడు ఇంటి నుంచి వెళ్లిన సమయంలో నలుపు బ్లూ గళ్ళ రంగు షర్టు, నల్ల ప్యాంటు, షూస్ ధరించి ఉన్నాడని వారు తెలిపారు. బాబు ఆచూకీ తెలిసిన వారు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ 86888 31614, 8688831343లో తెలియజేయాలన్నారు.



గుర్తింపు మార్చుకుని.. కుటుంబాన్ని వదులుకుని

- ఆరేళ్ల క్రితం తప్పించుకున్న పెరోల్ ఖైదీ అరెస్టు
- గుంటూరులో పట్టుకున్న కోదాడ డివిజన్ పోలీసులు

సూర్యాపేట క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): పెరోల్‌పై జైలు నుంచి బయటకు వచ్చి ఆరేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని సూర్యాపేట జిల్లా పోలీసులు పట్టుకున్నారు. సూర్యాపేటలోని పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కొత్తపల్లి నర్సింహ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లికి చెందిన బొడ్డు తిరుపతి 2012లో హైదరాబాద్ వనస్థలిపురంలో ఒకరిని హత్యచేసిన కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. 2015లో రంగారెడ్డి జిల్లా మూడో అదనపు సెషన్స్ కోర్టు తిరుపతికి జీవిత ఖైదు శిక్ష విధించింది. అనంతరం తిరుపతిని పోలీసులు చర్లపల్లి జైలుకు పంపించారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో 2017 ఆగస్టు 17న నెల రోజుల పెరోల్‌పై బయటకు వచ్చిన తిరుపతి వెళ్లకుండా ఆరేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్నాడు. చర్లపల్లి జైలు అధికారులు గతేడాది ఫిర్యాదు చేయగా మఠంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి ఐటీ విభాగం సహకారంతో నిందితుడు గుంటూరులో ఉన్నట్లు నిర్ధారించుకున్నారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందం అక్కడికి వెళ్లి తిరుపతిని అదుపులోకి తీసుకుంది. తిరుపతి తన అసలైన గుర్తింపును పూర్తిగా మార్చుకుని, తన కుటుంబ సభ్యులు, స్వగ్రామం నుంచి పూర్తిగా సంబంధాలు తెంచుకున్నాడు. గుంటూరులోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అక్కడే ఓ మహిళను వివాహం చేసుకుని ఆమెతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. తన వద్ద గతం తాలూకు ఎటువంటి ఆధారాలు లేకుండా గతాన్ని పూర్తిగా దాచి ఉంచి పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ప్రయత్నించాడు. కోదాడ డివిజన్ పోలీసులు చేసిన ప్రత్యేక కృషితో తిరుపతి పోలీసులకు పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తదితరులు ఉన్నారు.

ప్రధాని సభ గ్రాండ్ సక్సెస్

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ఒక చిన్న పొరపాటు కూడా దొర్ల కుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమరావతి సభ గ్రాండ్ సక్సెస్ అయింది. ఇందుకోసం గత మూడు వారాలకు పైగా శ్రమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగాలను సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేకించి అభినందించారు. అమరావతికి తథాస్తు దేవతలు దీవించినట్లుగా ప్రకృతి కూడా సహకరించింది. వర్షం హెచ్చరిక ఉన్నప్పటికీ ఎక్కడా చిన్నపాటి చిరుజల్లు కూడా కురవలేదు. ఎండ తీవ్రత కూడా మధ్యాహ్నం 3 గంటల తర్వాత తగ్గిపోయింది. దీంతో ప్రజలు ఉపశమనానికి గురయ్యారు. అధికారులు పడ్డ కష్టం ఏర్పాట్లలో అణువణువునా కనిపించింది. ముఖ్యంగా గ్యాలరీల్లో కుర్చీలు, కూలర్లు, తాగునీటి సౌకర్యాల ఏర్పాటు వలన ప్రజలు ఇబ్బంది పడలేదు. ప్రజలు భారీ సంఖ్యలో లక్షలాదిగా తరలివస్తారని ముందుగానే అంచనా వేసి ముందస్తు జాగ్రత్తగా సభా ప్రాంగణానికి ఎదురుగానే మరో లక్షన్నర మంది కూర్చునేలా ఏర్పాట్లు చేయడం మంచిదైంది. లేకుంటే ఎండలో మలమలలాడిపోయే వారే.

అమరావతి రాజధాని నిర్మాణ పనుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని కనీవిని ఎరుగని రీతిలో నిర్వహించాలని సీఎం చంద్రబాబునాయుడు తలపోశారు. అందుకు తగినట్లుగా ఆయన తరచుగా సమీక్షలు నిర్వహించి ఆదేశాలు ఇచ్చారు. మంత్రులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించారు. అలానే సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కూడా కీలక బాధ్యతలు కేటాయించి ఎవరి పని వారు చేసేలా స్వేచ్ఛ ఇచ్చారు. దాంతో అధికారులు ఒక టీం వర్కు మాదిరిగా కష్టించారు. రాత్రింబవళ్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగ లక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ అయితే గత 20 రోజుల నుంచి నిత్యం అమరావతిలోనే ఉంటూ ఏర్పాట్లను పరిశీలిస్తూ వచ్చారు. బందోబస్తు ప్రణాళికని ఎంతో పకడ్బందీగా రూపొందించారు. సభా ప్రాంగణం, వేదికలు, షెడ్లు, పార్కింగ్ ప్రదేశాలు వంటి అన్ని ఏర్పాట్లను చక్కగా చేశారు. వీటన్నింటి కారణంగానే ప్రధాని సభ గ్రాండ్ సక్సెస్ అయింది.

వందలాది మంది అధికారులు... వేలాదిమంది శ్రామికులు

ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన వందలాది మంది అధజకారులు, వేలాది మంది సిబ్బంది, శ్రామికులు కష్టపడ్డారు. హెలిప్యాడ్ మొదలుకొని సభా ప్రాంగణం వరకు కిలోమీటర్ పొడవునా బ్యారికేడింగ్ ఏర్పాటు చేసి ఈగ కూడా దూరకుండా పహార కాశారు. విద్యుత్ శాఖ అధికారులు భారీ జనరేటర్లను తెప్పించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూశారు. నగరపాలకసంస్థ అధికారులు పారిశుద్ధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తీసేయించారు. వైద్య ఆరోగ్య శాఖ పెద్ద వైద్య శిబిరమే ఏర్పాటు చేసి వైద్య సాయాన్ని అందించింది. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ అధికారులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించారు.


మోదీ సభకు తరలివెళ్తున్న టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి కందుకూరి వెంకట్ తదితరులు

మోదీ సభకు భారీగా తరలిన తెలుగు తమ్ముళ్లు

గుంటూరు(తూర్పు), మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమానికి విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివెళ్లారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో 10వ డివిజన్‌లో వందలాదిగా కార్యకర్తలు తరలివెళ్లారు. పార్లమెంట్ అధికార ప్రతినిధి కందుకూరి వెంకట్, సీనియర్ నాయకుడు కూరాకుల ప్రభాకర్ నేతృత్వంలో సభకు హాజరయ్యారు.

15వ డివిజన్ పరిధిలో....

ప్రధాని మోదీ సభకు 15వ డివిజన్ టీడీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో సభకు డివిజన్ పరిధిలో వందలాది కార్యకర్తలు సభకు హాజరయ్యారు. డివిజన్ అధ్యక్షుడు సూరే శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, మీరావలి, లక్ష్మీ, మాజీ కార్పొరేటర్ ఈర్ల గురవయ్య తదితరులు పర్యవేక్షించారు.



మోదీ సభకు తరలివెళ్తున్న 15వ డివిజన్ టీడీపీ నాయకులు

ఆడిట్ సిబ్బందే తనను గెలిపించారు

- పదవీ విరమణ సభలో నాగేంద్రకుమార్

గుంటూరు సిటీ, మే 2 (ఆంధ్రజ్యోతి) విధి నిర్వహణలో కిందిస్థాయి సిబ్బంది అందించిన సహాయ సహకారాలతోనే ఉద్యోగ జీవితంలో ఓ అధికారిగా తాను విజయవంతమయ్యానని జె.నాగేంద్రకుమార్ అన్నారు. గుంటూరు నగరపాలక సంస్థలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ హోదాలో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన నాగేంద్రకుమార్ సన్మాన సభ శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఒంగోలు నగరపాలక సంస్థ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ బి.చిన్నపరెడ్డి మాట్లాడుతూ సాంకేతికను అందిపుచ్చుకుంటూ నాగేంద్రకుమార్ ఉద్యోగుల్లో స్ఫూర్తిని కలిగించారన్నారు. ఆడిట్ జోన్-3 ప్రాంతీయ ఉప సంచాలకుడు కె.నాగశ్రీనివాసరావు (ఒంగోలు) ప్రసంగిస్తూ ఆడిట్ సిబ్బందిని నాగేంద్రకుమార్ ముందుండి నడిపించారని, ఏ సమస్య తలెత్తినా తానున్నానని భరోసా ఇచ్చేవారని ప్రశంసించారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ దంపతులను ఆడిట్ సిబ్బంది శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. వారికి వెంకటేశ్వర స్వామి జ్ఞాపికను బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆర్థిక అధికారి కొర్లకుంట వెంకట సుబ్బారావు, గుంటూరు నగరపాలక సంస్థ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఎలీషా, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ పద్మజ, ఎక్సైజ్ విభాగం జాయింట్ కమిషనర్ అనసూయాదేవి, నాగార్జున విశ్వవిద్యాలయం ఆడిట్ అధికారి శ్రీపెరంబుదూరు శ్రీకాంత్, జిల్లా ఆడిట్ అధికారులు భాగ్యారావు (బాపట్ల), శంకరనారాయణరెడ్డి (ప్రకాశం), సహాయ ఆడిట్ అధికారులు చిగురుపాటి రాజమల్లేశ్వరరావు, పులిగడ్డ శ్రీనివాసరావు, అశోక్, మనూజ, సుధ, రవికృష్ణ, ఆడిట్ ఎన్జీవో సంఘం నేతలు ఆంజనేయరెడ్డి, రవిబాబులతోపాటు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.




అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్ (తూర్పు), గళ్లా మాధవి (పశ్చిమ)


అమరావతిలో జరిగిన సభలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట), చదలవాడ అరవిందబాబు (నరసరావుపేట), భాష్యం ప్రవీణ్ (పెదకూరపాడు), ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు






లోకేశ్‌తో మోదీ చమత్కారం ● మోదీతో రాజధాని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



● సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు




మోదీతో మంత్రి అనగాని

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మంత్రి లోకేశ్

అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజదాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోందని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశా రు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధానమంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరిం చుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది.






దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీ బయట జనం

అమరావతి పులకింత

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సీఎం చంద్రబాబు నాయుడుపై ప్రశంసల జల్లు కురిపించారు. టెక్నాలజీ నేను కనిపెట్టానని చంద్రబాబు చెబుతున్నాడు కానీ వాస్తవానికి నాకంటే ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు అప్పట్లోనే టెక్నాలజీని అభివృద్ధి చేశారని అన్నారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన టెక్నాలజీని పరిశీలించేందుకు అధికారుల బృందాన్ని సైబరాబాద్ పంపినట్లు వెల్లడించారు. అభివృద్ధి చేయటం అంటే చంద్రబాబును చూసి నేర్చుకోవాల్సిన అవసరం ఉందని మోదీ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు గురించి మోదీ మాట్లాడుతున్న సందర్భంలో ప్రజల నుండి విశేషమైన స్పందన లభించింది. మోదీ ప్రసంగంలో ఆద్యంతం చంద్రబాబు నాయుడిని ఆకాశానికి ఎత్తటం అమరావతి రైతుల మోము లో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నికలకు ముందు చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి సభకు హాజరైన ప్రధాన మంత్రి అప్పుడు విపక్ష నేతగా ఉన్న చంద్రబాబు గురించి పెద్దగా మాట్లాడలేదు. చంద్రబాబు నాయుడు నాకంటే గొప్ప నాయకుడని పొడిపొడిగా ప్రస్తావించడం జరిగింది. అంతే కాదు అమరావతి అభివృద్ధి గురించి ఎటువంటి హామీ కూడా ఇవ్వలేదు. ఎన్నికలు ముగిసి చంద్రబాబు నాయుడు విశేషమైన మెజార్టీతో అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న తర్వాత మోదీ ఆయనను అవకాశం వచ్చినప్పుడల్లా పొగడ్తలతో ముంచేత్తుతున్నారు. సహజంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్న సందర్భంలో మోదీ మరి ఏ ఇతర నాయకుడు గురించి పెద్దగా ప్రస్తావించిన సందర్భాలు లేవు. అమరావతి పనుల పునఃప్రారంభోత్సవానికి వచ్చిన మోదీ అందుకు భిన్నంగా ప్రవర్తించి సీఎం చంద్రబాబు నాయుడు పై ప్రశంసల వర్షాన్ని కురిపించారు. గడచిన ఐదేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వం వల్ల ఎన్నో ఇబ్బందులకు గురైన రాజధాని రైతులకు ప్రధాని మోదీ తన ప్రసంగం ద్వారా ఎంతో మనోధైర్యాన్ని కల్పించారు. చంద్రబాబు నాయుడిని ఆయన పొగుడుతున్న సందర్భంలో అమరావతి రైతులు భారీ ఎత్తున హర్షధ్వానాలు చేయటం కనిపించింది. త్వరలో అమరావతి పూర్తయి ఆంధ్రప్రదేశ్‌ను అధునాతన శక్తిగా మారుస్తుందని మోదీ కొనియాడటంతో భూములను త్యాగం చేసిన రైతులు పరవశించిపోయారు. మరో మూడేళ్ళలో మహా అమరావతి పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్న చంద్రబాబుకి తన భుజం కూడా కలిపి శ్రమించి దిగ్విజయం చేసేందుకు సహకరిస్తానని హామి ఇవ్వటంతో ప్రజల హర్ష ధ్వానాలతో ప్రాంగణం హోరెత్తింది.

పోలీసుల తీరు నాడు అలా.. నేడు ఇలా..

గతంలో బొప్పూడి సభ జరిగినప్పుడు పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. సాక్షాత్తు దేశ ప్రధాని హాజరైన సభ అయినప్పటికీ పోలీసులు నాటి ముఖ్యమంత్రి జగన్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన్ను మెప్పించేందుకు సభకు హాజరయ్యే జనాలకు ఎన్నో అవరోధాలు కల్పించారు. దాంతో ఆనాడు ఆ సభకు వచ్చే ప్రజలు అనేక ఇబ్బందులను చవిచూశారు. పోలీసులు సృష్టించిన అడ్డంకుల మూలంగా ప్రజలు బొప్పూడి సభా ప్రాంగణానికి చేరుకునేందుకు ఎక్కువ సమయం పట్టింది. దీంతో ప్రధాని మోదీ ప్రసంగం ముగిసే సమయానికి కూడా వేలాది మంది సభా ప్రాంగణం వైపు నడుచుకుంటూ రావటం కనిపించింది. అంతే కాదు సభా ప్రాంగణంలో తగిన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయకపోవటంతో పెద్ద ఎత్తున తొక్కిసలాట జరగ్గా నేరుగా ప్రధాన మంత్రే పలు మార్లు మైక్ తీసుకొని తోసుకోవద్దని పలు మార్లు ప్రజల్ని వారించటమే కాకుండా పోలీసు అధికారులను పదే పదే హెచ్చరించి ప్రాణాపాయం జరగకుండా చూశారు. అయితే శుక్రవారం జరిగిన ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం కనిపించింది. నాడు అడ్డంకులు సృష్టించిన పోలీసులు నేడు సభను విజయవంతం చేసేందుకు అహర్నిశలు శ్రమించారు. వాహనాల రాకపోకలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూశారు. ట్రాఫిక్ జామ్‌లను నియంత్రించేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సాక్షాత్తు పోలీసు ఉన్నతాధికారులే నిలబడి ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు శ్రమిం చారు. మండుటెండలో సైతం పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు ఎంతో శ్రమించారు. ఏ మార్గంలో కూడా ట్రాఫిక్ జామ్‌లు లేక పోవటంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సభాస్థలికి బయలుదేరిన ప్రజలు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా సకాలంలో ప్రాంగణానికి చేరుకోగలిగారు.

- చంద్రబాబును ఆకాశానికి ఎత్తిన ప్రధాని మోదీ
- టెక్నాలజీ నాకంటే ముందే బాబు తీసుకువచ్చారు
- సైబరాబాద్ చూడటానికి గుజరాత్ నుంచి అధికారులను పంపించా..
- సీఎంపై పొగడ్తల వర్షం ● నాడు బొప్పూడి సభకు.. నేడు వెలగపూడి సభకు ఎంతో తేడా..

పల్నాడు జిల్లా నుంచి లక్ష మందికిపైగా..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభకు పల్నాడు జిల్లా నుంచి లక్ష మందికి పైగా తరలివెళ్లారు. అధికారికంగా కలెక్టర్ పి.అరుణ్‌బాబు నేతృత్వంలో 1,100 బస్సులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీతో పాటు విద్యా సంస్థల బస్సులను సమకుర్చారు. ప్రజలకు తాగు నీరు, ఆహార వసతిని కల్పించారు. జనం తరలింపును కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్షించారు. అధికారికంగా ఏర్పాటు చేసిన వహనాల్లో దాదాపు 55,000 మంది తరలి వెళ్లారని జిల్లా యంత్రాంగం తెలిపింది. పజాప్రతినిధులు, జనసేన, బీజేపీ నేతలు ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేశారు. పార్టీల పరంగా దాదాపు 50 వేల మంది జన సమీకరణ చేశారు. ఇందులో పెదకూరపాడు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ నేతృత్వంలో 40 వేల మంది వరకు సభకు తరలి వెళ్లారని నేతలు తెలిపారు. జన సమీకరణలో నరసరావుపేట జిల్లా నేతలు, అధికారులు విజయవంతమయ్యారు.



గుంటూరు నుంచి 1900 బస్సుల్లో..

గుంటూరు, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవ సభకు శుక్రవారం గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రజలు తరలివెళ్లారు. గుంటూరు-1, 2 డిపోలతో పాటు తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోల నుంచి 1,900 బస్సులను అధి కారులు ఏర్పాటు చేశారు. అయా ప్రాంతాలకు ఉదయానికే బస్సులు చేరుకొన్నాయి. సభకు వెళ్లే బస్సులు ఎటువంటి లోటుపాట్లు ఉండ కుండా కండిషన్‌లో ఉండేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. సభ ముగిసిన తర్వాత సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రజల్ని వారి గమ్యస్థానాలకు చేర్చారు. సాధారణ ప్రయాణికుల కోసం 30 నుంచి 40 శాతం బస్సులు కేటాయించామని గుంటూరు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) ఎం.రవికాంత్ తెలిపారు. ఇందు కోసం ప్రత్యేకంగా సిబ్బంది కేటాయించి, పర్యవేక్షించారు.

ప్రధాని సభలో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్లు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): వెలగపూడిలో శుక్రవారం జరిగిన రాజధాని పునర్నిర్మాణ సభలో కార్పొరేషన్లకు చెందిన చైర్మన్లు పాల్గొన్నారు. ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు సభలో పాల్గొన్నారు.



సభకు వెళుతున్న వారితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల జిల్లా నుంచి భారీగా..

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా నుంచి అమరావతి సభకు భారీ ఎత్తున జనం తరలి వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 380 బస్సులు శుక్రవారం ఉదయం 7 గంటలకే ఆయా పాయింట్ల వద్దకు చేరుకున్నాయి. 9 గంటలకల్లా దాదాపు అన్ని బస్సులు జనంతో రాజధాని బాటపట్టాయి. ప్రతి బస్సులో ఆశ వర్కర్, ఏఎన్ఎం, పోలీసును నియమించారు. 35 మంది సిబ్బందితో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు కూడా కంట్రోల్ రూం పనిచేసింది. ఉదయం నుంచి జిల్లా కలెక్టర్ వెంకటమురళి కంట్రోల్ రూంలోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. బస్సుల్లో తరలివెళ్లే ప్రజలకు మార్గమధ్యంలో నాలుగు పాయింట్ల వద్ద భోజనం అందించడానికి యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. పొన్నూరు ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో భోజన సదుపాయాన్ని కలెక్టర్ పరిశీలించారు. చీరాల ఎమ్మెల్యే కొండయ్య పట్టణంలోని పలు ప్రాంతాల్లో, బాపట్లలో ఎమ్మెల్యే వేగేశన బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.



ప్రధానికి ఘన స్వాగతం పలికిన గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అమరావతి రాజధానిలోని వెలగపూడిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర గవర్నర్ మహమ్మద్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఘనస్వాగతం పలికారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా ప్రధానిని స్వాగతించారు. అలానే ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ప్రత్తిపాడు శాసనసభ్యుడు బూర్ల రామాంజనేయులు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి కూడా హెలిప్యాడ్ వద్ద ప్రధానికి స్వాగతం పలికారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ప్రధాని మోదీ హెలికాఫ్టర్‌లో వెలగపూడికి చేరుకొన్నారు. అయన ప్రయాణించిన హెలికాఫ్టర్‌తో పాటు కాన్వాయ్‌గా మరో రెండు హెలికాఫ్టర్‌లు కూడా వచ్చాయి. సెక్యూరిటీ కారణాల దృష్ట్యా హెలిప్యాడ్ వద్దకు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులెవ్వరిని ఎస్పీజీ బలగాలు అనుమతించలేదు. ప్రధాని తన వాహనంలో కూర్చుని రోడ్డుకు ఇరువైపులా తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన మహిళలకు అభివాదం చేస్తూ సభా స్థలికి చేరుకొన్నారు. వేదిక వెనుక ఏర్పాటు చేసిన అమరావతి గ్యాలరీలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్‌నాయుడు, మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్ తదితరులను ప్రధాని పలకరించారు.

వర్చువల్ విధానంలోనే...

అమరావతి రాజధాని పనుల పునరుద్ధరణతో పాటు రైల్వే, జాతీయ రహదారులు, రక్షణ తదితర శాఖల అభివృద్ధి పనులన్నింటిని ప్రధాని మోదీ వర్చువల్ విధానంలోనే ఆవిష్కరించారు. సభా స్థలి వెనక 20 అడుగుల పైలాన్‌ని ఏ(అమరావతి) ఆకారంలో సీఆర్‌డీఏ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి నిర్మించాయి. అయితే వివిధ కారణాల రీత్యా ఆ పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని రద్దు చేశారు. దాంతో నాగాయలంక వద్ద క్షిపణి ప్రయోగ పరీక్ష శ్రేణి, గోరంట్ల - హిందూపూర్ నాలుగు వరసల రహదారి విస్తరణ, ముద్దనూరు - బీ కొత్తపల్లి ఫోర్‌లేన్ హైవే విస్తరణ, నంద్యాల - కర్నూలు రెండు వరసల రహదారి విస్తరణ, ముదిరెడ్డిపల్లె - కడప/నెల్లూరు సరిహద్దు వరకు రెండు వరసల రహదారి విస్తరణ, ఎన్‌హెచ్-16 పరిధిలో రణస్థలం వద్ద ఆరు వరసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, యర్రమంచి - గుడిపల్లి గ్రామాల్లో ఆర్‌వోబీ, గుంతకల్లు వెస్టు - మల్లప్ప గేట్ స్టేషన్ల మధ్య ఆర్‌వోబీ, విశాఖ పట్టణం మధురవాడలో పీఎం ఏక్తా మాల్ పనులకు వర్చువల్‌లో ప్రధాని శంకుస్థాపన చేశారు. అలానే పూర్తి అయిన జాతీయ రహదారులు, రైలు మార్గాలను ప్రారంభించి జాతికి అంకితం చేశారు.



మోదీతో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు



సభకు వెళుతున్న బస్సుల వద్ద కొమ్మారెడ్డి కిరణ్ తదితరులు

పునర్నిర్మాణ సభకు పోటెత్తిన అభిమానం

● గ్రామాల నుంచి సభకు తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
● ఏర్పాట్లు చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు



మంగళగిరి ఆంజనేయ కాలనీ నుంచి బస్సుల్లో బయల్దేరిన టీడీపీ శ్రేణులు



తాడేపల్లి నుంచి బస్సులో తరలివెళుతున్న మహిళలు



ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

మంగళగిరి సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణపనుల పునఃప్రారంభోత్సవానికి మంగళగిరి నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పాటు ప్రజలు భారీగా తరలివెళ్లారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బస్సులను స్థానిక నేతలు జెండా ఊపి ప్రారంభించారు. సుందరయ్య నగర్, సూర్యనారాయణ నగర్, భగత్‌సింగ్ నగర్, శ్రామికనగర్ నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివెళ్లారు. ఆయా కార్యక్రమాలలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కారంపూడి అంకమ్మరావు, 22వ వార్డు అధ్యక్షుడు ఏడుకొండలు, 21వ వార్డు అధ్యక్షుడు వంగర రమేష్, నేతలు ఒడిశా నరేష్, బలభద్ర రమేష్, ఒడిశా సురేష్, రాజారావు, ఆకురాతి నాగేంద్రంపాల్గొన్నారు.

● తాడేపల్లి/తాడేపల్లి టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం, పట్టణ పరిధిలోని వివిధ గ్రామా లు, పలు ప్రాంతాల నుంచి అమరావతి పునఃప్రారంభోత్సవ సభకు ప్రజలు భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గ టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి కిరణ్ బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ అమరావతి పునర్నిర్మాణంతో రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. అమరావతి ఐదు కోట్లమంది ప్రజలకు చెందిందని, ముఖ్యం గా రైతుల త్యాగం మరువలేనిదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం సీఎం చంద్రబాబు పిలుపు మేరకు 34వేల ఎకరాల భూమిని త్యాగంచేశారని గుర్తుచేసుకున్నారు. ప్రధాని మోదీ ఆశీస్సులతో చంద్రబాబు సారధ్యంలో అమరావతి మళ్లీ పరుగులు పెడుతుందని తెలిపారు. పట్టణ ప్రాంతంలో బస్సులను వల్లభనేని వెంకట్రావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చిగురుపాటి సుబ్బారావు, గుండిమెడ రమేష్‌బాబు, నామతోటి రాంబాబు, అనుమోలు వీరాంజనేయ ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుగ్గిరాల మండలం నుంచి..

దుగ్గిరాల, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరిగిన ప్రధాని నరేంద్రమోదీ బహిరంగసభకు కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండల గ్రామం చిలువూరు నుంచి శుక్రవారం మధ్యాహ్నం అమరావతికి బయలుదేరిన బస్సులకు ఎంపీపీ షేక్ జబీన్ జెండా ఊపి సాగనంపారు. దుగ్గిరాల నుంచి బయలుదేరిన బస్సులకు గూడూరు వెంకట్రావు, నరసింహరావు, గద్దెవాసు, నక్కా చిరంజీవి తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షుడు పసుపులేటి గణేష్, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఐదేళ్లలో అభివృద్ధికి దూరంగా వున్న రాష్ట్రానికి చరిత్రలో నిలిచిపోయే ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం లక్ష్యంగా వేలకోట్ల రూపాయల అభివృద్ధి పనుల శంకస్థాపనకు విచ్చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి ఘనస్వాగతం పలికేందుకు బీజేపీ, జనసేన నాయకులు పలు బస్సులు, ప్రైవేటు వాహనాలలో తరలివెళ్లారు.

ప్రత్తిపాడు మండలం...

ప్రత్తిపాడు, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గం నుండి అమరావతి పునఃప్రారంభ సభకు భారీగా ప్రజలు తరలివెళ్లారు. నియోజకవర్గం నుండి భారీగా జన సమీకరణ కోసం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ప్రత్తిపాడు నియోజకవర్గం నుండి 485 బస్సులతో పాటు ద్విచక్ర వాహనాలు, కార్లలో సుమారు 25 వేలకు మందికి పైగా ప్రజలు మోది సభకు హాజరయ్యారు. ఉదయం నుండి ఎమ్మెల్యే అన్ని గ్రామాల నాయకులను సమన్వయం చేసుకుంటూ అన్ని సౌకర్యాలను పర్యవేక్షించారు. అంతే కాకుండా నియోజకవర్గ ప్రజల కోసం తాడికొండ అడ్డరోడ్డు వద్ద, యూనివర్సిటీ వద్ద ప్రత్యేకంగా భోజన స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు అందరికి సక్రమంగా భోజన సదుపాయాలు అందేలా దగ్గరుండి పరిశీలన చేశారు. బస్సులలో ప్రయాణించే ప్రజలకు మజ్జిన ప్యాకెట్లు పంపిణీ చేశారు.

పెదనందిపాడు మండలం..

పెదనందిపాడు, మే 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి రాజధాని అమరావతి పునఃనిర్మాణ వేడుకలకు ప్రజలు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. నాయకులు ఆయా గ్రామాల్లో బస్సులు ఏర్పాటుచేశారు. తొలుత ఆయా గ్రామ నాయకులు జెండాలను ఊపి బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరు మండలం..

వట్టిచెరుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం అమరావతికి వస్తున్న నేపథ్యంలో మండలంలోని గ్రామాల నుంచి టీడీపీ, జనసే, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ ఎత్తున తరలివెళ్లారు. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన బస్సుల్లో తరలివెళ్లారు. వీరికి బస్సుల్లో తాగు నీరు, ఆహార పొట్లాలు సమకూర్చారు.

రైతన్న డెయిరీ సేవలు అభినందనీయం

గుంటూరు(తూర్పు), మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునఃశంకుస్థాపన సభకు తరలివెళ్తున ప్రజలకు, కూటమి కార్యకర్తలకు స్థానిక ఏటుకూరు బైపాస్ వద్ద రైతన్న డైయిరీ తరుపున పెదనందిపాడు మండలం, రాజుపాలెం సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు కమ్మ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో దాదాపు లక్ష ప్యాకెట్ల మజ్జిగ, వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రారంభించారు.



ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



దుగ్గిరాల మండలం చిలువూరు నుంచి అమరావతి సభకు వెళ్లే బస్సులకు జెండా ఊపుతున్న ఎంపీపీ జబీన్



వట్టిచెరుకూరు: పుల్లడిగుంట ఐదో మైలు వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించిన ఉప్పుటూరి చిన రాములు, నేరెళ్ల సోములు



కేఆర్ కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

శ్రీమహంకాళీ అమ్మవారి పునఃప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

దుగ్గిరాల, మే 2(ఆంధ్రజ్యోతి): మండల గ్రామం కేఆర్‌కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం పునఃప్రతిష్ఠ ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 4వ తేదీన పెద్ద ఎత్తున ఆలయ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్న విషయం విదితమే. తొలిరోజు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9.09గంటలకు శ్రీగణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యపూజ, ప్రాసన, రుత్విగ్వరణం, దీక్షలు, అఖండ దీపస్థాపన, పంచామృతాభిషేకాలు తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు తారక్‌నాథ్‌శర్మ, సుబ్రహ్మణ్యశర్మ, మణిశర్మ తదితరులు పూజాకార్యక్రమాల్లో నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు మృత్సంగ్రహణ, అంకురారోపణం, త్రిశూలమంటపార్చన, శాంతికుంభార్చన, అగ్నిప్రతిష్ఠాపన, ఆవరణాదిహోమాలు, గజారోహణం, బలిహరణ, ప్రసాద వినియోగం నిర్వహించారు. వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్, ఈఓ కోగంటి సునీల్ భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భావనారుషి స్వామికి ప్రత్యేక పూజలు

మంగళగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి దామర్ల నాంచారమ్మ ప్రాంగణంలో ఉన్న శ్రీ భద్రావతీ సమేత భావనారుషి స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం భావనారుషి స్వామి జన్మ నక్షత్రం సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు గావించారు. ఈ ఉత్సవానికి కొల్లి వీరబ్రహ్మం దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం అధ్యక్షుడు చింతక్రింది కనకయ్య, కోశాధికారి గంజి రవీంద్రనాథ్, కార్యదర్శి రామనాథం పూర్ణచంద్రరావు, వంగర పెదలక్ష్మయ్య, జొన్నాదుల భిక్షారావు, బిట్రా భాస్కరరావు, సందుపట్ల భూపతి, కాంద్రు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 1098 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.10,400, గరిష్టధర రూ.11,350, మోడల్ ధర రూ.11,000 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ. 10,400, గరిష్ట ధర రూ.11,350, మోడల్‌ధర రూ.11,000 పలికాయి.

పశ్చిమడెల్టాకు 1316 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, మే 2(ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమడెల్టాకు విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి 1316 క్యూసెక్కుల నీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.5 అడుగుల నీటిమట్టం ఉండగా రేపల్లెకాల్వకు 190, తూర్పుకాల్వకు 128, పశ్చిమకాల్వకు 66, నిజాంపట్నంకాల్వకు 225, కొమ్మమూరుకాల్వకు 514 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

రాజధాని గ్రామాలలో పండుగ వాతావరణం

● తుళ్లూరులో మేళతాళాలతో ఆహ్వానం పలికిన రైతులు, మహిళలు

తుళ్లూరు, మే 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునఃనిర్మాణ పనుల శంకుస్థాపన సభ మధ్యాహ్నం 3.30 గంటల నుండి 5.15వరకు జరిగింది. దీంతో రాజధాని గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం తుళ్లూరులో రైతులు, మహిళలు మేళతాళాలతో గ్రామంలో పాదయాత్ర చేస్తూ మోదీ సభకు తరలిరావాలని ఆహ్వానించారు. రెండు రోజుల నుండి ఆహ్వానపత్రికలు ఇంటింటికి తిరిగి అందజేశారు. బాణసంచా కాల్చుతూ గ్రామం మొత్తం తిరిగి ప్రధాని సభను విజయవంతం చేయాలని కోరారు. అంబేద్కర్ విగ్రహానికి మహిళలు, రైతులు, తాడికొండ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య పూలదండలు వేసి ఆహానపత్రికను ఉంచారు. ఈ కార్యక్రమంలో అమరావతి రైతు జేఏసీ సమన్వయ కమిటీ సభ్యుడు పువ్వాడ సుధాకరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్‌కుమార్, టీడీపీ నాయకులు ఉప్పలపాటి సాంబశివరావు, జమ్ముల హరికిరణ్, బండ్ల పటాభిరామయ్య, జమ్ముల అనిల్, కొల్లి నరేంద్ర, మూల్పూరి రాంబాబు, పాటిబండ్ల జయకృష్ణ, తాడికొండ నియోజకవర్గ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చందు, మహిళా జేఏసీ నేతలు ఆలూరి పావని, కామినేని గోవిందమ్మ, అరుంధతి, అధిక సంఖ్యలో మహిళలు, రైతులు పాల్గొన్నారు. అనంతరం ప్రధాని సభకు తరలివెళ్లారు. కాగా అనేక జిల్లాల నుండి ప్రధాని సభకు లక్షల్లో జనం తరలివచ్చారు. సభ విజయవంతంగా ముగిసింది.



ప్రధాని సభకు వెళ్లే ముందు తుళ్లూరులో పాదయాత్ర చేస్తూ ఆహ్వానం పలుకుతున్న మహిళలు, రైతులు



తాడికొండలో పీఎం సభకు వెళ్లే ప్రజలకు వాటర్, ఓఆర్ఎస్, భోజనం ప్యాకెట్లు అందిస్తున్న అధికారులు



తాడికొండ: కంతేరు నుంచి పీఎం సభకు బస్సులో వెళ్తున్న ప్రజలు



తాడికొండ: నిడుముక్కల నుంచి తరలివెళ్తున్న మహిళలు



వట్టిచెరుకూరు: సభకు తరలివెళుతున్న కూటమి నేతలు

అన్ని దారులు అమరావతి వైపే..

● ప్రజలు ఇబ్బందిపడకుండా తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

తాడికొండ, మే 2(ఆంధ్రజ్యోతి): రాజధాని పునఃనిర్మాణ శంకుస్థాపన సభకు అన్నిదారులు అమరావతి వైపే కదిలాయి. రాజధాని అమరావతికి వెళ్లటానికి తాడికొండ మీదుగా వాహనాలకు రూట్‌ను ఏర్పాటు చేశారు. నేషనల్ హైవే మీదుగా ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు కంతేరు నుంచి తాడికొండ మీదుగా అమరావతి పీఎం సభకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. పల్నాడు జిల్లా, ప్రకాశం, బాపట్ల, రాయలసీమ జిల్లాల నుంచి వారికి గుంటూరు నుంచి లాం, తాడికొండ, పెదపరిమి వైపుగా సభకు చేరుకునేలా రూట్ మ్యాప్‌ను ఇచ్చారు. ఉదయం 9 గంటల నుంచి ప్రధాని సభకు దూర ప్రాంతాల నుంచి ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, కార్లు, ప్రైవేటు వాహనాల ద్వారా భారీగా తరలివెళ్లారు. తాడికొండ నియోజకవర్గం నుంచి భారీగా ప్రజలు అమరావతికి తరలివెళ్లారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వమే ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచింది. పెద్ద ఎత్తున మహిళలు తరలివెళ్లారు. తాగునీటికి ఇబ్బంది కలగకుండా వాటర్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. తాడికొండ ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా కౌంటర్లు ఏర్పాటుచేసి బస్సుల్లో, ప్రైవేటు వాహనాల్లో సభకు వెళ్లేవారికి వాటర్ బాటిల్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. భోజన ఏర్పాట్లను చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వారికి సూచనలు ఇచ్చారు.

● **తాడికొండ నియోజకవర్గ ప్రజల ఆనందం**

రాజధాని అమరావతి తాడికొండ నియోజకవర్గంలో భాగం అవ్వటంతో నియోజకవర్గ ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రతి కార్యక్రమం ఇక్కడే జరగటంతో ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పీ-4 పథకాన్ని రాజధానిలో సీఎం ప్రారంభించటంతో పాటు, అంబేద్కర్ జయంతి వేడుకలను తాడికొండ మండలం పొన్నెకల్లులో నిర్వహించారు. ప్రధానమంత్రి సభకు తాడికొండ నియోజకవర్గం నుంచి టీడీపీ, బీజేపీ, జనసేనపార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

నేటి నుంచి వేళాంగిణిమాత మహోత్సవాలు

పెదనందిపాడు, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బినేనిగుంటపాలెం వేళాంగిణి మాత తిరుణాళ్ల మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు విచారణ గురువు ఎం బల్తజార్ రాజు శుక్రవారం తెలిపారు. శనివారం పండుగ, ఆదివారం దివ్యపూజాబలి కార్యక్రమం, సోమవారం గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య భక్తులకు దైవసందేశం ఇస్తారని తెలిపారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

● ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు

పెదనందిపాడు, మే 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరాల ద్వారా సృజనాత్మకతను పెంపొందించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు శుక్రవారం శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకులు జంపని రామారావు, గారపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ అమరావతికి ఏమిచ్చాడు..?

తుళ్ళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతికి ప్రధానమంత్రి మోదీ ఏమిచ్చాడని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకా విజయ ప్రశ్నించారు. శుక్రవారం మోదీ సభ ముగిసిన అనంతరం విలేకరులతో విజయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో వారికి బలమైన నాయకత్వం లేక మోదీ గారడీలు చేస్తుంటారని విమర్శించారు. ఏపీసీసీ చీఫ్ షర్మిల ఈ విషయాన్ని పసిగట్టి అమరావతి సందర్శనార్థం వస్తుంటే అన్యాయంగా నిర్బంధించారన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలి

మంగళగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలుచేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత యూ గనిరాజు డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ మాజీ నేత, రైతు కూలీ సంఘం నేత స్వర్గీయ నందనం వెంకట్రావు 24వ వర్ధంతి సభ చినకాకాని గ్రామంలో శుక్రవారం జరిగింది. వెంకట్రావు స్థూపం వద్ద నేతలు నివాళులు అర్పించి గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో గనిరాజు మాట్లాడుతూ వెంకట్రావు మృతి విప్లవోద్యమానికి తీరని లోటన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అమరాతి రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.5 లక్షల కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీను, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, నేతలు ఎన్.పోతురాజు, దూపాటి శ్రీను, ఎస్కే రజియా తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రంలో చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. శుక్రవారం అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు మాచర్ల నాగేశ్వరావు జన్మదినోత్సవం సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, జాలాది వెంకటేశ్వరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో పాదచారులకు చల్లని మజ్జిగ, తాగునీరును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు మాచర్ల నాగేశ్వరావు, లక్ష్మీసౌజన్య, శ్రీనివాసరావు, ప్రతాప్, వాసు, ప్రదీప్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

దాడిచేశాడంటూ అన్నపై తమ్ముడు ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): దాడిచేశాడంటూ అన్నపై తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఐతానగర్‌కు చెందిన ఐమళ్ల రవిబాబు, ఐమళ్ల రవికుమార్‌లు అన్నదమ్ములు. రవిబాబు చెప్పులు రిపేరు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అన్నదమ్ముల మధ్య ఆర్థిక లావాదేవీలపై వివాదం నడుస్తోంది. గురువారం రాత్రి తమ డబ్బు ఇవ్వాలని రవిబాబు అతని భార్య అఖిల రవికుమార్‌ని అడగగా మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో రవికుమార్ కర్రతో తమ్ముడు రవిబాబు, మరదలు అఖిలపై దాడి చేశాడు. దీంతో వారిద్దరికి రక్తగాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు గాయపడిన ఇద్దరిని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శుక్రవారం బాధితులు టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మూతపడిన ఎస్‌బీఐ ఏటీఎంలు

● మారిన నిర్వహణ ఏజెన్సీలు
● ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు



నెహ్రూరోడ్డులో మూసేసిన ఎస్‌బీఐ ఏటీఎం, కొత్తపేట మెయిన్ బ్రాంచ్‌లో పనిచేయని ఏటీఎం

తెనాలి అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ నిర్వహిస్తున్న పలు ఏటీఏంలు మూతపడ్డాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏటీఏంలను మూసివేయడంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఇబ్బందులు అంతాఇంతా కావు. ఎస్‌బీఐ ఏటీఎంల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తుంది. ఈ సంస్థల గడువు ముగియడంతో నిర్వహణ దక్కించుకున్న కొత్త సంస్థలు ఏటీఏంలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎస్‌బీఐ కింద నాలుగు ప్రైవేట్ సంస్థలు ఏటీఏంల నిర్వహణ బాధ్యతలు చూస్తున్నాయి. రెండు నెలల క్రితం ఒక సంస్థ నిర్వహణ నుంచి మరో సంస్థ నిర్వహణలోకి ఏటీఏంలను నిర్వహించే కాంట్రాక్టు దక్కించుకున్నట్లు ఎస్‌బీఐ అధికారులు చెబుతున్నారు. దీంతో ఇప్పటివరకు నిర్వహిస్తున్న సంస్థలు ఉన్న ఏటీఏంలను తొలగించి తీసుకువెళ్లాయి. మరికొన్నిచోట్ల మూతవేసి ఉంచాయి. కొత్త నిర్వహణ సంస్థ ఏటీఏంలను ఏర్పాటు చేసేందుకు రెండు నెలలుగా కసరత్తు చేస్తూనే ఉంది. దీంతో పట్టణంలో వహాబ్ రోడ్డు, కోర్టు రోడ్డు, నెహ్రూ రోడ్డు, మెడికల్ షాప్స్ రోడ్డు, చెంచుపేట వంటి పలు ప్రాంతాలలో ఏటీఏంలను మూసివేశారు. కొన్ని చోట్ల షట్టర్ తెరిచి ఉంచడంతో నగదు డ్రా చేసేందుకు వెళ్లిన వారికి లోపల పని చేయడం లేదనే బోర్డు కనబడటంతో వెనుదిరుగుతున్నారు. ఇలా పలుచోట్ల నగదు డ్రా చేసేందుకు వెళ్లిన వారికి ఏటీఏంలు పని చేయకపోవడంతో ఉసూరుమంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఉండే ఒక్క ఏటీఏం పని చేయకపోవడంతో రెండు నెలలుగా నగదు కోసం ఖాతాదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రైవేట్ బ్యాంకులు ఏటీఏంలు ఏర్పాటు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో నగదు రాకపోవడం, ప్రతి లావాదేవీకి చార్జీలు పడటంతో గ్రామీణ ఖాతాదారులు నష్టపోతున్నారు. మారిన సంస్థ ఏటీఏంలు ఏర్పాటు చేసేవరకు ఉన్న ఏటీఏంలను నిర్వహించేలా చూడాల్సిన ఎస్‌బీఐ అధికారులు పట్టించుకోవడం లేదని ఖాతాదారులు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో వెంటనే దృష్టి సారించి ఏటీఏంల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఖాతాదారులు కోరుతున్నారు.

7 నుంచి పొన్నూరులో రాష్ట్రస్థాయి నాటికల పోటీలు

పొన్నూరు టౌన్, మే, 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7నుంచి పొన్నూరు పట్టణంలో 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్లు పొన్నూరు కళాపరిషత్ అధ్యక్షుడు ఎస్.ఆంజనేయులునాయుడు తెలిపారు. శుక్రవారం నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదిక వద్ద నాటికల పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. 7వ తేదీన అరవింద ఆర్ట్స్ తాడేపల్లి ఆర్ట్స్ విడాకులు కావాలి తొలినాటికను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. కత్రపాడు ఉషోదయ కళానికేతన్ వారి కిడ్నాప్ రెండో నాటికగా, 8వ తేదీన చిగురుమేఘం, బ్రహ్మస్వరూపం, కన్నెగంటి హనుమంతు బుర్రకథ, 9వ తేదీన ఆ సత్యం, దేవరాగం, 27వ మైలురాయి, 10వ తేదీన జనరల్‌బోగీలు, కమనీయం నాటికలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. తొలిరోజు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, విశిష్ట అతిథిగా ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు హాజరవనున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ నాటికల పోటీలను వీక్షించేందుకు కళారంగ ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నిర్వాహకులు ఆకుల సాంబశివరావు, నన్నపనేని రఘునాథ్, సీహెచ్ రామకృష్ణరావు, ఎం.విజయకుమార్‌రెడ్డి, డాక్టర్ బేసిబాబు, మురళీకృష్ణ, తాతారావు, వేంకటేశ్వర్లు, రామకోటేశ్వరరావు, నారాయణరావు, రహంతుల్లా, మురళి తదితరులు పాల్గొన్నారు.



అమరావతిలో జరిగిన పునఃనిర్మాణ పనుల ప్రారంభ సభ వద్ద ఆత్మీయంగా పలకరించుకుంటున్న మంత్రులు లోకేశ్, నాదెండ్ల మనోహర్

ప్రధాని సభ గ్రాండ్ సక్సెస్

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ఒక చిన్న పొరపాటు కూడా దొర్లకుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమరావతి సభ గ్రాండ్ సక్సెస్ అయింది. ఇందు కోసం గత మూడు వారాలకు పైగా శ్రమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగాలను సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకించి అభినందించారు. అమరావతికి తథాస్తు దేవతలు దీవించినట్లుగా ప్రకృతి కూడా సహకరించింది. వర్షం హెచ్చరిక ఉన్నప్పటికీ ఎక్కడా చిన్నపాటి చిరుజల్లు కూడా కురవలేదు. ఎండ తీవ్రత కూడా మధ్యాహ్నం 3గంటల తర్వాత తగ్గిపోయింది. దీంతో ప్రజలు ఉపశమనానికి గురయ్యారు. అధికారులు పడ్డ కష్టం ఏర్పాట్లలో అణువణువునా కనిపించింది. ముఖ్యంగా గ్యాలరీల్లో కుర్చీలు, కూలర్లు, తాగునీటి సౌకర్యాల ఏర్పాటు వలన ప్రజలు ఇబ్బంది పడలేదు. ప్రజలు భారీ సంఖ్యలో లక్షలాదిగా తరలివస్తారని ముందుగానే అంచనావేసి ముందస్తు జాగ్రత్తగా సభా ప్రాంగణానికి ఎదురుగానే మరో లక్షన్నర మంది కూర్చునేలా ఏర్పాట్లు చేయడం మంచిదైంది. లేకుంటే ఎండతో ఇబ్బందిపడేవారే. అమరావతి రాజధాని నిర్మాణ పనుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని కనీవినీ ఎరుగుని రీతిలో నిర్వహించాలని సీఎం చంద్రబాబునాయుడు తలపోశారు. అందుకు తగినట్లుగా ఆయన తరచుగా సమీక్షలు నిర్వహించి ఆదేశాలు ఇచ్చారు. మంత్రులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసి బాధ్యతలు అప్పగించారు. అలానే సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కూడా కీలక బాధ్యతలు కేటాయించి ఎవరి పని వారు చేసేలా స్వేచ్ఛ ఇచ్చారు. దాంతో అధికారులు ఒక టీం వర్కు మాదిరిగా కష్టించారు. రాత్రింబవళ్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ అయితే గత 20 రోజుల నుంచి నిత్యం అమరావతిలోనే ఉంటూ ఏర్పాట్లను పరిశీలిస్తూ వచ్చారు. బందోబస్తు ప్రణాళికని ఎంతో పకడ్బందీగా రూపొందించారు. సభా ప్రాంగణం, వేదికలు, షెడ్లు, పార్కింగ్ ప్రదేశాలు వంటి అన్ని ఏర్పాట్లను చక్కగా చేశారు. వీటన్నింటి కారణంగానే ప్రధాని సభ గ్రాండ్ సక్సెస్ అయింది.

వందలాది మంది అధికారులు... వేలాదిమంది శ్రామికులు

ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన వందలాది మంది అధికారులు, వేలాదిమంది సిబ్బంది, శ్రామికులు కష్టపడ్డారు. హెలీప్యాడ్ మొదలుకొని సభా ప్రాంగణం వరకు కిలోమీటర్ పొడవునా బ్యారికేడింగ్ ఏర్పాటు చేసి జాగ్రత్తగా పహారా కాశారు. విద్యుత్ శాఖ అధికారులు భారీ జనరేటర్లను తెప్పించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూశారు. నగరపాలకసంస్థ అధికారులు పారిశుద్ధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తీసివేయించారు. వైద్య ఆరోగ్య శాఖ పెద్ద వైద్య శిబిరమే ఏర్పాటు చేసి వైద్య సాయాన్ని అందించింది. రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ అధికారులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించారు.



అమరావతిలో జరిగిన పునఃనిర్మాణ పనుల ప్రారంభ సభకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

1నే పింఛన్లు అందటంపై లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు

తెనాలి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ప్రతి నెలా ఒకటవ తేదీనే దీర్ఘకాలిక అనారోగ్యసమస్యలతో మంచంపట్టినవారు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు నేరుగా ఇళ్లకే వెళ్లి అందిస్తుండటంతో లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం ప్రకారం పించన్లను పెంచకుండా దఫాలవారీగా అంటూ మాట మార్చి లబ్ధిదారులను ఉసూరుమనిపించింది. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు చెప్పిన విధంగానే పింఛన్ సొమ్మును పెంచడంతో పాటు లబ్ధిదారుల్లో ఆనందాన్ని నింపింది. కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతోనే నేరుగా పింఛన్లు పంపిణీ చేయించటంలో పూర్తి విజయం సాధించింది. లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి అందిస్తూ ఇది మంచి ప్రభుత్వమని మన్ననలు పొందుతోంది.

అమరావతి పునర్నిర్మాణ సభకు తరలిన ప్రజలు



తెనాలి నుంచి అమరావతి సభకు తరలి వెళుతున్న కూటమి శ్రేణులు, కొలకలూరు నుంచి ర్యాలీగా వెళుతున్న జనసేన నాయకులు

తెనాలి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రుల రాజధాని అమరావతి పునఃనిర్మాణ సభకు తెనాలి నుంచి భారీగా ప్రజలు తరలివెళ్లారు. జనసేన పార్టీ కార్యాలయం నుంచి ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ద్విచక్రవాహనాలపై ర్యాలీగా వెళ్లగా పట్టణ, మండల గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సులలో వేలాదిగా ప్రజలు తరలివెళ్లారు. ఆంధ్రుల కలల రాజధాని సాకరమయ్యే క్షణాన్ని కళ్లారా చూసి ఆనందించేందుకు తామంతా వెళుతున్నట్లు పలువురు తెలిపారు.

150 బస్సుల్లో అమరావతికి

పొన్నూరు టౌన్, మే, 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃనిర్మాణ సభకు పొన్నూరు, చేబ్రోలు మండలాలకు చెందిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు 150 బస్సుల్లో శుక్రవారం తరలివెళ్లారు. అమరావతి పునఃప్రారంభ సభ విజయవంతం చేయాలని గత కొన్ని రోజులుగా స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. పొన్నూరు పట్టణ, మండలం నుంచి 105 బస్సులు, చేబ్రోలు మండలం నుంచి 50బస్సుల్లో కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ప్రస్తుతం వేసవి ఎండలు తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో అమరావతి సభకు తరలివెళ్లే వారు ఇబ్బంది పడకుండా స్థానిక టీడీపీ నాయకులు బస్సుల్లోనే తాగునీరు, అల్పాహారం, భోజనం, మజ్జిగ సౌకర్యాలను ఏర్పాటుచేశారు. సుమారు పొన్నూరు చేబ్రోలు మండలాల నుంచి 5000మంది అమరావతి సభకు తరలి వెళ్లినట్లు సమాచారం. పార్టీ సమకూర్చిన బస్సుల్లోనే కాకుండా కార్లు, ద్విచక్ర వాహనాలు, ప్రత్యేక వాహనాల్లో సైతం నేతలు తరలివెళ్లారు. అమరావతి సభకు తరలివెళ్తున్న వాహనాలతో పొన్నూరు వీధులు సందడిగా మారాయి. పొన్నూరు వైపునుంచే కాకుండా బాపట్ల, ప్రకాశం జిల్లాల వాహనాలు సైతం పొన్నూరు ప్రాంతం నుంచే భారీగా తరలివెళ్లాయి.



పొన్నూరులో నుంచి సభకు వెళ్తున్న ముస్లింలు, మహిళలు



పారుదల లేక కాలువలో తెట్టకట్టిన మురుగు

వ్యర్థాలను తొలగించరూ..

తెనాలి, మారీసుపేట,మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారీసుపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఉన్న మురుగునీటి కాలువలో వ్యర్థాలు పేరుకొనిపోయి మురుగునీరు పారక తెట్టకట్టి రోజుల తరబడి అక్కడే నిల్వ ఉండటంతో వైద్యసేవలు నిమిత్తం వైద్యశాలకు వెళ్లే రోగులు, ఆ రోడ్డులో వెళ్లే ప్రజలు దుర్గంధంతో ముక్కుమూసుకొని వెళ్లే పరిస్థితి నెలకొని ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించి మురుగు నీరు పారేలా చర్యలు తీసుకోవాలని ఆ వార్డు ప్రజలు కోరుతున్నారు.

కొలకలూరులో ఆహ్వాన నాటికల పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్వామి, మురళీధర్, కిడ్నాప్‌నాటికలోని సన్నివేశం



తెనాలి అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని కొలకలూరులో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉభయ రాష్ట్ర స్థాయి 11వ ఆహ్వాన నాటికల పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కొలంకపూరి నాటక కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు స్వామి, ఉపాధ్యక్షుడు సుద్దపల్లి మురళీధర్ జ్యోతి వెలిగించి నాటకాలు ప్రారంభించారు. పొన్నూరు కళా పరిషత్ అధ్యక్షుడు ఆకుల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో వరగాని పరిషత్ అధ్యక్షుడు టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రతిఏటా కొలకలూరులో నాటిక పోటీలు నిర్వహించి కళలను, కళాకారులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. సమాజాన్ని చైతన్యపరిచే కళలను ఆదరించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షుడు పాండురంగారావు, కొండవీటి పరిషత్ అధ్యక్షుడు శ్రీహరి, రామాంజనేయులు, కళాంజలి కార్యదర్శి సాంబశివరావు ప్రసంగించారు. అనంతరం కాట్రపాడు ఉషోదయ కళానికేతన్ కళాకారులు కిడ్నాప్ నాటికను ప్రదర్శించారు. వీరన్నపాలెం కళానికేతన్ కళాకారులు రుతువులేని కాలం, విజయవాడ గురజాడ కళామందిర్ కళాకారులు మహా ప్రస్థానం నాటికలు ప్రదర్శించారు. మరో నాటిక రుతువు లేని కాలం సమాజంలో సంప్రదాయాలకు, కుటుంబ బంధాలకు విలువ లేకుండా పోతుందని, కోడలు మైనాన్ని గ్రహించిన అత్తగారు ఆమెను మార్చి కుటుంబ బంధం తెలియజేయడమే ఇతివృత్తంగా కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. రంగస్థల నటుడు గంగోత్రి సాయికి కరణం సురేష్ జ్ఞాపకార్థం సవ్యసాచి అవార్డు ప్రదానం చేశారు. సంగీత దర్శకుడు పి.లీలామోహనరావుకు టి.సాంబశివరావు స్మారక పురస్కారం అందజేశారు.



స్వామివారికి లక్ష మల్లెలతో పూజలను నిర్వహిస్తున్న బాలస్వామి తదితరులు

జగద్గురు ఆదిశంకరుని జయంతి

తెనాలి, మారీసుపేట,మే 2 (ఆంధ్రజ్యోతి): జగద్గురు శ్రీఆదిశంకర, శ్రీరామానుజ స్వామి వార్ల జయంతి వేడుకలను విద్యాపీఠం ట్రస్ట్, శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ సభ్యులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో శ్రీసాలిగ్రామ ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) స్వయం పర్యవేక్షణలో జగద్గురు శ్రీఆదిశంకరాచార్యులు, శ్రీరామానుజస్వామి వార్ల జయంతి సందర్భంగా లక్ష మల్లెల పూలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి ప్రవచనం చేస్తూ శ్రీఆదిశంకరాచార్యులు వారు సనాతన ధర్మం కోసం వాటి విలువల కోసం ఎంతో కృషిచేసి ప్రబోధించారన్నారు. హిందూ సనాతన ధర్మం వేదాలను భారతదేశమంతా కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు ధర్మప్రబోధం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటించాలన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో నంబూరు వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాథం, రాజేశ్వరావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వేసవి సెలవల్లో తరగతులను నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్

తెనాలి, మారీసుపేట,మే 2 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవల్లో విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక గాంధీనగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం వెంకటేష్ ఇతర నాయకులతో కలసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంస్థలకు వేసవి సెలవలు ప్రకటించిన కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులకు బ్రిడ్జి కోర్సుల పేరుతో అక్రమంగా తరగతులను నిర్వహిస్తున్నారన్నారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు దోచుకుంటున్నారన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఉల్లాసంగా గడపవలసిన సమయంలో ఈ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తూ వారిని మానసికంగా హింసిస్తున్నారని అన్నారు. ఆ కళాశాలలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జీవో నెం.77 రద్దుచేసి అందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కోరారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు భూమేష్, ట్రెజరర్ తేజ, సహాయ కార్యదర్శి దినేష్, అఖిల్, పండు, కోట్లు, హేమంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.



చక్రాల కుర్చీలను అందజేస్తున్న క్లబ్ సభ్యులు

బాల బాలికలకు చక్రాల కుర్చీల పంపిణీ


తెనాలి అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన బాల బాలికలకు చక్రాల కుర్చీలను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్, పిడుగురాళ్ల లైమ్‌సిటీ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామని అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పావులూరి రాంబాబు, మురళీకృష్ణ, వెంకటరత్నం, సుబ్బారావు, రాజేంద్ర ప్రసాద్, నారాయణ, కిషోర్, అనంత్, కుర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర ద్వారా పాఠ్య పుస్తకాల సరఫరా



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో కొల్లి విజయభాస్కర్ తదితరులు

పొన్నూరు టౌన్, మే, 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి మిత్ర ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు అవసరమైన అన్ని పాఠ్య పుస్తకాలను విద్యా సంవత్సరం ముందే సమకూరుస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈవో కొల్లి విజయభాస్కర్ తెలిపారు. పొన్నూరు మండల రెండో ఎంఈవోగా శుక్రవారం విజయభాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర ప్రోగ్రాం స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పాఠ్యపుస్తకాలు విద్యార్థుల హాజరు వివరాలు పరిశీలించారు. బడిబయట బాలలు తప్పనిసరిగా పాఠశాలలకు రప్పించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యావనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



యంగ్ ఇండియా సేవాపురస్కారం అందుకుంటున్న ఉమాశంకర్

ఉమాశంకర్‌కు యంగ్‌ఇండియా సేవా పురస్కారం

పొన్నూరు టౌన్, మే, 2 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మన పొన్నూరు బ్లడ్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్‌కు యంగ్ ఇండియా సేవా పురస్కారం లభించింది. గురువారం హైదరాబాద్ నాంపల్లి మదీనా స్కూల్‌లో యంగ్ ఇండియా సంస్థ 10వ వార్షికోత్సవం జరిగింది. పలు రాష్ట్రాల్లో రక్తదానం మోటివేటర్లకు యంగ్ ఇండియా సేవా పురస్కారాలు అందజేశారు. పొన్నూరు ప్రాంతంలో రక్తదానం ద్వారా సేవలందిస్తున్న ఉమాశంకర్‌ను ముఖ్య అతిథి ఐఏఎస్ అధికారి అశోక్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి తదితరులు యంగ్ ఇండియా అవార్డును ప్రదానం చేసి సత్కరించారు.